వాస్తవాలు పలుకు DD9 వార్త
TGTEL/26/A2635
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ సంపుటి: 06 సంచిక: 124 14-09-2026 సోమవారం పేజీలు: 10 వెల: 3/-






## పోలీస్ కస్టడీకి మాజీ హవిల్దార్ మల్లేశ్

- బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం
- సికింద్రాబాద్ కోర్టులో పోలీసులకు అనుకూల తీర్పు
- ఎల్లుండి నుంచి కస్టడీలోకి మల్లేశ్
- మరికొందరినీ విచారించనున్న దర్యాప్తు అధికారులు
- చోరీ వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌పై ఆరా
- ఆయుధాలను ఎవరికి అప్పగించాలనుకున్నాడో విచారణ
- మల్లేశ్ వెల్లడించే వివరాలపై పోలీసుల దృష్టి



## టిమ్స్‌లో రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్

- రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ వర్క్‌షాప్ ప్రారంభం
- ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ
- టిమ్స్‌లో అత్యాధునిక రోబోటిక్ పరికరాల పరిశీలన
- మౌలిక వసతులపై నిపుణులతో మంత్రి చర్చ
- రోబోటిక్ సర్జరీ సేవల విస్తరణపై దృష్టి
- వైద్య రంగంలో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం
- ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలే లక్ష్యం
- తెలంగాణ వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం
- ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే ధ్యేయం
- కార్యక్రమంలో వైద్య శాఖ ఉన్నతాధికారులు, నిపుణులు



# రూల్స్ పాటించడం కాదు.. రూల్స్ సెట్ చేయాలి

- బ్రిక్స్ నేతలతో ప్రధాని నరేంద్ర మోదీ
- గ్లోబల్ సౌత్ తీరుపై మోదీ కీలక వ్యాఖ్యలు
- నిబంధనలు పాటించేవిగా కాక.. రూపొందించేవిగా ఎదగాలి
- భిన్నత్వమే బ్రిక్స్ దేశాల బలమని వ్యాఖ్య
- ప్రపంచ ఘర్షణల ప్రభావం సామాన్యులపై పడుతోందన్న ప్రధాని
- సవాళ్లను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచన
- అంటువ్యాధుల ముందస్తు హెచ్చరిక వ్యవస్థపై ఏకాభిప్రాయం
- బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌కు మోదీ ప్రతిపాదన
- సాంకేతికత, ఖనిజాలతో బెదిరింపులను వ్యతిరేకించాలని పిలుపు
- జిన్‌పింగ్ సమక్షంలో అరుదైన ఖనిజాలపై కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ, (డీడీ9 వార్త):**

ప్రపంచ సంక్షోభాల విషయంలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందు వరుసలో ఉన్నప్పటికీ.. నిర్ణయాలు తీసుకునే విషయంలో మాత్రం వెనుక వరుసలోనే ఉంటున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇకపై గ్లోబల్ సౌత్ దేశాలు నిబంధనలు పాటించేవిగానే కాకుండా.. ప్రపంచానికి నిబంధనలు రూపొందించేవిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న బ్రిక్స్ వార్షిక సదస్సులో మోదీ మాట్లాడారు.

ప్రపంచవ్యాప్తంగా ఘర్షణలు నిరంతరం పెరుగుతున్నాయని ప్రధాని మిగతా 2 లో..

# రోశయ్య దూరదృష్టితోనే తెలంగాణకు మిగులు బడ్జెట్

- రోశయ్య సేవలను గుర్తుచేసుకున్న రేవంత్
- ఆర్థికమంత్రిగా సుదీర్ఘకాలం కొనసాగారని వెల్లడి
- తెలంగాణ మిగులు బడ్జెట్‌కు ఆయన దూరదృష్టే కారణమని వ్యాఖ్య
- తన రాజకీయ ప్రస్థానంపై రోశయ్యకు ముందుచూపు ఉందన్న సీఎం
- ఆవేశానికి ఆలోచన తోడవ్వాలని సూచించేవారని గుర్తు చేసుకున్న రేవంత్
- రోశయ్య విమర్శించేవారు.. దూషించేవారు కాదని ప్రశంస
- హైదరాబాద్‌తో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉందని వెల్లడి
- రోశయ్య విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని ప్రకటన
- ఆర్యవైశ్యుల ఆర్థిక క్రమశిక్షణను కొనియాడిన సీఎం
- రాజకీయాల్లో తమ వాటా సాధించుకోవాలని పిలుపు
- ఉప్పల్ భగాయత్ లో ఆర్యవైశ్య భవనానికి శంకుస్థాపన



**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

మాజీ సీఎం, సీనియర్ నేత కొణిజేటి రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్ వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆత్మగౌరవ భవనం కేవలం ఆగర్భ శ్రీమంతులకే పరిమితం కాకూడదని రేవంత్‌రెడ్డి అన్నారు. పేద ఆర్యవైశ్యుల పిల్లలకు కూడా ఈ భవనం ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. భవనం భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా నిర్మించాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా దీనిని తీర్చిదిద్దాలని అన్నారు.

**రోశయ్యతో అనుబంధం**

తన రాజకీయ జీవితంలో రోశయ్య ఇచ్చిన సలహాలను సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. గతంలో సీఎంలు ఎంతమంది మారినా రోశయ్య సుదీర్ఘకాలం ఆర్థికమంత్రిగా కొనసాగారని తెలిపారు. ఆర్థిక అంశాలపై ఆయనకు ఉన్న అవగాహన, దూరదృష్టిని కొనియాడారు. తెలంగాణకు మిగులు బడ్జెట్ రావడంలో ఆయన మిగతా 2 లో..

# ఒకే ఫ్రేమ్‌లో మోదీ.. పుతిన్.. జిన్‌పింగ్

- బ్రిక్స్ వేదికపై ఆసక్తికర దృశ్యం
- ఫ్యామిలీ ఫొటోకు నేతల ఫోజులు
- మధ్యలో ప్రధాని మోదీ ఇరువైపులా పుతిన్, జిన్‌పింగ్
- నవ్వుతూ కెమెరాలకు పోజులు
- సోషల్ మీడియాలో వైరల్‌గా ఫొటో
- అంతర్జాతీయ మీడియాలోనూ ప్రత్యేక ప్రాధాన్యం
- వరుసగా మూడోసారి ఒకే వేదికపై ముగ్గురు నేతలు
- భారత్-రష్యా-చైనా సంబంధాలకు ప్రతిబింబంగా చిత్రం
- జిన్‌పింగ్ భారత్ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం



**ఢిల్లీ, (డీడీ9 వార్త):**

న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ఆసక్తికర దృశ్యం కనిపించింది. బ్రిక్స్ దేశాల అధినేతలు తీసుకున్న 'ఫ్యామిలీ ఫొటో' సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భారత్ మండపంలో జరిగిన ఈ ఫొటో సెషన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మధ్యలో నిలవగా.. ఆయనకు ఇరువైపులా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నిలబడి కెమెరాలకు పోజులిచ్చారు.

ముగ్గురు నేతలు పక్కపక్కనే నిలబడి నవ్వుతూ ఫొటోకు పోజివ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత్, రష్యా, చైనా మధ్య ఉన్న కీలక దౌత్య సంబంధాలను ప్రతిబింబించే చిత్రంగా ఈ ఫొటో అంతర్జాతీయ మీడియాలోనూ ప్రాధాన్యం పొందింది.

**వరుసగా మూడోసారి..**

మోదీ, పుతిన్, జిన్‌పింగ్ ముగ్గురూ వరుసగా మూడోసారి బ్రిక్స్ వేదికపై కనిపించడం మరో విశేషం. 2024లో రష్యాలోని మిగతా 2లో..

# కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదు

- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం
- కాంగ్రెస్ నేత కొండా మురళి కీలక ప్రకటన
- సురేఖ గెలుపులో రాహుల్ పాత్ర ఉందని వెల్లడి
- పదవులు వస్తాయి.. పోతాయని వ్యాఖ్య
- మాట కోసం నిలబడతామని స్పష్టీకరణ
- సురేఖకు సారీ చెప్పాలని సూచించారని వెల్లడి



**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన తర్వాత తొలిసారిగా కొండా దంపతులు వరంగల్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ రాహుల్ గాంధీపై తమ కుటుంబానికి ఉన్న అభిమానాన్ని, కాంగ్రెస్ పార్టీతో తమ అనుబంధాన్ని స్పష్టం చేశారు.

కొండా సురేఖను ఎన్నికల్లో గెలిపించడంలో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషించారని మురళి అన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పదవులు శాశ్వతం మిగతా 2లో..

# అనంత్ అంబానీ విరాళం.. తిరుమలకు చేరిన 15 ఎలక్ట్రిక్ బస్సులు

- టీటీడీకి మొత్తం 25 బస్సుల విరాళం
- ఇప్పటికే తిరుమలకు చేరిన 15 బస్సులు
- రూ.27.5 కోట్ల విలువైన బస్సులు
- 50 మంది డ్రైవర్లను అందించనున్న రిలయన్స్
- ఛార్జింగ్ స్టేషన్ కూడా ఏర్పాటు
- జూన్‌లో విరాళాన్ని ప్రకటించిన అనంత్ అంబానీ
- బ్రహ్మోత్సవాల్లో భక్తులకు సేవలు
- ఈనెల 16న బస్సుల ప్రారంభం
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం
- భారత్ బయోటెక్ నుంచి మరో 7 బస్సులు



**తిరుమల, (డీడీ9 వార్త):**

తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచేలా తితిదేకు మరో కీలక సహకారం అందుతోంది. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ విరాళంగా ప్రకటించిన 25 ఎలక్ట్రిక్ ధర్మరథం బస్సుల్లో 15 బస్సులు ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకున్నాయి. మిగిలిన బస్సులు కూడా మిగతా 2లో..

# ముంబయిలో ట్రాఫిక్ నరకం.. గడ్కరీకి తప్పని ఆలస్యం

- గంట ఆలస్యంగా కార్యక్రమానికి గడ్కరీ
- వర్లీ నుంచి బయల్దేరినా ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రి
- ముంబయి రోడ్ల పరిస్థితిపై తీవ్ర అసంతృప్తి
- దశాబ్దాల నాటి మౌలిక సదుపాయాలే సమస్య
- 1995-2000లో 55 ఫ్లైఓవర్ల నిర్మాణం
- బాంద్రా-వర్లీ సీ లింక్ నిర్మాణంలో కీలక పాత్ర
- ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్‌వేకు గడ్కరీ ప్రస్తావన
- పాత ఫ్లైఓవర్ల స్థానంలో ఆధునిక నిర్మాణాలు
- బహుళస్థాయి ఫ్లైఓవర్లకు మలేషియా సాంకేతికత
- భారత్ సామర్థ్యాలకు అమెరికా వనరుల జోడింపు

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

ముంబయి రోడ్ల పరిస్థితి, పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలపై కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ ఎంతగా ఉందో తన అనుభవంతోనే చెప్పకనే చెప్పారు. వర్లీ నుంచి బయల్దేరినప్పటికీ ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో ఓ కార్యక్రమానికి ఏకంగా గంట ఆలస్యంగా చేరుకున్నారు.

ముంబయిలో ఇండోఅమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం నిర్వహించిన 22వ ఇండోఅమెరికన్ కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమానికి గడ్కరీ హాజరయ్యారు. ఆలస్యంగా వచ్చినందుకు అక్కడి వారికి క్షమాపణలు చెప్పారు. ముందుగానే బయల్దేరినప్పటికీ ట్రాఫిక్ కారణంగానే ఆలస్యమైందని వివరించారు. తాను చేసిన తప్పునకు మూల్యం చెల్లించుకుంటున్నానంటూ చమత్కరించడంతో కార్యక్రమంలో మిగతా 2లో..





## ఒకే ఫ్రేమ్‌లో మోదీ.. పుతిన్.. జిన్‌పింగ్

**మొదటిపేజీ తరువాయి**

కజాన్‌లో, 2025లో చైనాలోని తియాంజిన్‌లో జరిగిన బ్రిక్స్ సమావేశాల తర్వాత తాజాగా న్యూఢిల్లీలో వీరు మరోసారి భేటీ అయ్యారు.

**జిన్‌పింగ్ పర్యటనపై ఆసక్తి**

ఈసారి జిన్‌పింగ్ భారత్‌కు రావడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. 2019 తర్వాత ఆయన తొలిసారి భారత్‌లో పర్యటిస్తున్నారు. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత దెబ్బతిన్న భారత్‌చైనా సంబంధాలను తిరిగి గాడిలో పెట్టేందుకు ఇరువైపులా ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ఆయన పర్యటన సాగుతోంది.



## పోలీస్ కస్టడీకి మాజీ హవిల్దార్ మల్లేశ్

- **బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం**
- **సికింద్రాబాద్ కోర్టులో పోలీసులకు అనుకూల తీర్పు**
- **ఎల్లుండి నుంచి కస్టడీలోకి మల్లేశ్**
- **మరికొందరినీ విచారించనున్న దర్యాప్తు అధికారులు**
- **చోరీ వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌పై ఆరా**
- **ఆయుధాలను ఎవరికి అప్పగించాలనుకున్నాడో విచారణ**
- **మల్లేశ్ వెల్లడించే వివరాలపై పోలీసుల దృష్టి**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

బొల్లారంలోని ఆర్మీ మద్రాస్ రెజిమెంట్‌లో జరిగిన ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ హవిల్దార్ మల్లేశ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు సికింద్రాబాద్ కోర్టు అనుమతించింది. ఎల్లుండి నుంచి మల్లేశ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకోనున్నారు.

కస్టడీలో భాగంగా మల్లేశ్‌ను ఆయుధాల చోరీకి సంబంధించిన కీలక అంశాలపై పోలీసులు ప్రశ్నించనున్నారు. చోరీ వెనుక ఉన్న నెట్‌వర్క్, ఇతర వ్యక్తుల ప్రమేయం, ఆయుధాల తరలింపు వంటి అంశాలపై వివరాలు సేకరించనున్నారు. మల్లేశ్‌తో పాటు కేసుతో సంబంధం ఉన్న మరికొందరినీ పోలీసులు విచారించే అవకాశం ఉంది.

**ఆయుధాలు ఎవరికి?**

ఆర్మీ రెజిమెంట్ నుంచి చోరీ చేసిన ఆయుధాలను మల్లేశ్ ఎవరికి అప్పగించాలనుకున్నాడనే అంశంపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఆయుధాల చోరీకి ముందు, తర్వాత ఎవరెవరితో సంబంధాలు కొనసాగించాడు? ఎవరితో సంప్రదింపులు జరిపాడు? ఆయుధాలను ఎక్కడికి తరలించాలనుకున్నాడు? అనే కోణాల్లో దర్యాప్తు చేయనున్నారు.

మల్లేశ్ వెల్లడించే వివరాలు కేసు దర్యాప్తులో కీలకంగా మారే అవకాశం ఉంది. ఆయన చెప్పే సమాచారాన్ని ఇతర ఆధారాలతో సరిపోల్చి పోలీసులు దర్యాప్తును మరింత లోతుగా కొనసాగించనున్నారు.

**ఎన్ఐఏకు సమాచారం**

ఆయుధాల చోరీ వెనుక ఉన్న నెట్‌వర్క్‌కు సంబంధించి మల్లేశ్ నుంచి లభించే కీలక వివరాలను ఎన్ఐఏకు రాష్ట్ర పోలీసులు అందించనున్నారు. చోరీ చేసిన ఆయుధాల వెనుక ఉన్న ఉద్దేశం, వాటి వినియోగం, ఇతర వ్యక్తుల ప్రమేయం వంటి అంశాలపై కేంద్ర దర్యాప్తు సంస్థకు సమాచారం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

మల్లేశ్ కస్టడీ విచారణతో కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఆయుధాల చోరీ వెనుక అసలు నెట్‌వర్క్ ఎవరిదనే దానిపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు.

## అనంత్ అంబానీ విరాళం.. తిరుమలకు చేరిన 15 ఎలక్ట్రిక్ బస్సులు

**మొదటిపేజీ తరువాయి**

త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

ఈ ఏడాది జూన్‌లో అనంత్ అంబానీ తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తితిదేకు రూ.27.5 కోట్ల విలువైన 25 ఎలక్ట్రిక్ బస్సులను విరాళంగా అందించనున్నట్లు ప్రకటించారు. బస్సులకు అవసరమైన 50 మంది డ్రైవర్లతో పాటు ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా రిలయన్స్ సంస్థ అందించనుంది.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సామాన్య భక్తుల సౌకర్యార్థం ఈ బస్సులను ఈనెల 16న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నట్లు తితిదే అధికారులు తెలిపారు. ధర్మరథం సేవల్లో భాగంగా ఈ ఎలక్ట్రిక్ బస్సులు భక్తులకు ఉపయోగపడనున్నాయి.

ఇదిలా ఉండగా.. భారత్ బయోటెక్ సంస్థ కూడా తితిదేకు ఏడు ఎలక్ట్రిక్ బస్సులను అందించనుంది. రిలయన్స్, భారత్ బయోటెక్ సంస్థలు అందించే మొత్తం బస్సులు అందుబాటులోకి వస్తే తిరుమలలో భక్తుల ఉచిత రవాణా సౌకర్యం మరింత విస్తరించనుంది. ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో సామాన్య భక్తులకు మరింత సౌకర్యం కలగనుంది.

## వినాయకచవితి వేడుకలపై పోలీసుల పర్యవేక్షణ..

**మణుగూరు. సెప్టెంబర్ 13(డి డి 9వార్త)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సిఐ నాగబాబు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే పూలమార్కెట్ సెంటర్ వద్ద పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. పండుగ సందర్భంగా భక్తులు, ప్రజలు సురక్షితంగా,ప్రశాంతంగా వేడుకలను జరుపుకునేలా పోలీసు బందోబస్తు, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ నాగబాబు మాట్లాడుతూ,వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి ప్రజలు పోలీసు వారికి సహకరించాలని సూచించారు.

**అంబేద్కర్ సెంటర్ లో వాహన తనిఖీలు**

పట్టణం లోని అంబేద్కర్ సెంటర్ లో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారిపై వెళుతున్న వాహనాలను ఆపి వాహన పత్రాలను, డ్రైవింగ్ లైసెన్స్ లను పరిశీలించారు. అలాగే వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్ లను తనిఖీ చేసి బకాయిలను రికవరీ చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు సూచించారు.వాహనదారులు పెండింగ్ చలాన్ లను సకాలంలో చెల్లించి పోలీసు వారికి సహకరించాలని సూచించారు.



# రోశయ్య దూరదృష్టితోనే తెలంగాణకు మిగులు బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి**

దూరదృష్టి కీలకమని పేర్కొన్నారు.

తాను రాజకీయాల్లో సుదీర్ఘకాలం రాణిస్తానని రోశయ్య ముందుగానే గుర్తించారని రేవంత్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీలో తాను దూకుడుగా మాట్లాడుతున్నప్పుడు ఆవేశాన్ని తగ్గించుకోవాలని రోశయ్య సూచించేవారని తెలిపారు. *ఆవేశానికి ఆలోచన తోడైతేనే భవిష్యత్ ఉంటుందని* ఆయన సలహా ఇచ్చేవారని గుర్తుచేశారు.

**విమర్శించేవారు.. దూషించేవారు కాదు**

రోశయ్య రాజకీయ ప్రత్యర్థులను విమర్శించేవారని, అయితే వ్యక్తిగతంగా దూషించేవారు కాదని రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయాల్లో హుందాతనం, సంయమనం పాటించేవారని గుర్తుచేశారు. ఆయన నుంచి తాను అనేక విషయాలు నేర్చుకున్నానని తెలిపారు.

హైదరాబాద్‌తో తన అనుబంధం ముడిపడి ఉందని రోశయ్య తరచూ చెప్పేవారని సీఎం పేర్కొన్నారు. అందుకే ఆయన విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్‌తో రోశయ్యకు ఉన్న అనుబంధాన్ని భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ఆర్థిక క్రమశిక్షణ**

ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారని రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సలహాలు అవసరమైనప్పుడు ఆర్యవైశ్యులను సంప్రదిస్తారని అన్నారు. సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగినవారిగా ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. పేదరికం ఎదురైనా తమ బాధలను బయటకు చెప్పకుండా కడుపులో దాచుకునే స్వభావం ఆర్యవైశ్యుల్లో ఉందని సీఎం పేర్కొన్నారు. సమాజంలోని పేదల సంక్షేమం, వారి భవిష్యత్‌కు ఆత్మగౌరవ భవనం ఉపయోగపడేలా చూడాలని సూచించారు.

**రాజకీయాల్లో వాటా సాధించాలి**

ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉండి రాజకీయాల్లో తమ వాటాను సాధించుకోవాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధితో పాటు రాజకీయ ప్రాతినిధ్యం కూడా అవసరమని అన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే రాజకీయాల్లో మరింత బలమైన ప్రాతినిధ్యం సాధించవచ్చని పేర్కొన్నారు.

ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనం నిర్మాణం కేవలం ఒక భవనం ఏర్పాటు చేయడం కాదని.. భవిష్యత్ తరాలకు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు.

## రూల్స్ పాటించడం కాదు.. రూల్స్ సెట్ చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

అన్నారు. వాటి ప్రభావం సామాన్యుల జీవితాలపై పడుతోందని పేర్కొన్నారు. ఎదురయ్యే సవాళ్లను సకాలంలో గుర్తించి.. వాటిపై ముందుగానే చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని చెప్పారు. ఈ దిశగా బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

**అంటువ్యాధులపై ముందస్తు వ్యవస్థ**

అంటువ్యాధుల విషయంలో ముందస్తు హెచ్చరిక వ్యవస్థను ఏర్పాటు చేసే అంశంపై బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని మోదీ తెలిపారు. పరస్పర సహకారంతో ప్రపంచ దేశాలు మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి లక్ష్యాలను సాధించే క్రమంలో పర్యావరణానికి ఇబ్బంది కలిగించకూడదని అన్నారు.

అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణను పరస్పర విరుద్ధమైన లక్ష్యాలుగా చూడకూడదని ప్రధాని పేర్కొన్నారు. భారతీయ నాగరికత ఎప్పటినుంచో ప్రకృతిని తల్లిగా భావిస్తూ.. మానవాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత పాటిస్తోందని వివరించారు. భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను ఇది తెలియజేస్తోందన్నారు.

**బ్రిక్స్ స్టార్టప్ ఫండ్**

బ్రిక్స్ దేశాలన్నీ కలిసి *'బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్'* ఏర్పాటు చేయాలని మోదీ ప్రతిపాదించారు. ప్రత్యేక స్టార్టప్ నిధి అందుబాటులో ఉంటే బ్రిక్స్ దేశాల్లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తల మధ్య సహకారం మరింత పెరుగుతుందని అన్నారు.

కొత్త ఆలోచనలు, సాంకేతికత, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ తరహా సహకారం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలు తమ మధ్య ఉన్న భిన్నత్వాన్ని బలంగా మలచుకుని.. సమష్టి అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**జిన్‌పింగ్ సమక్షంలో**

**అరుదైన ఖనిజాలపై వ్యాఖ్యలు**

సాంకేతికతను, సంక్లిష్ట ఖనిజాలను ఉపయోగించుకుని ఇతర దేశాలను బెదిరించే చర్యలను వ్యతిరేకించాలని మోదీ పిలుపునిచ్చారు. ఇలాంటి చర్యలు సమష్టి వృద్ధికి అడ్డంకులు సృష్టిస్తాయని అన్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సమక్షంలోనే మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రపంచంలోని అరుదైన ఖనిజాల ప్రాసెసింగ్‌లో చైనా ఆధిపత్యం కొనసాగుతోంది. సోలార్ ప్యానెళ్ల నుంచి స్మార్ట్‌ఫోన్ల వరకు అనేక కీలక ఉత్పత్తుల తయారీలో ఈ ఖనిజాలు అవసరమవుతున్నాయి. గతంలో అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో చైనా అరుదైన ఖనిజాల ఎగుమతులపై నిబంధనలను కఠినతరం చేసింది. అనంతరం కొన్ని ఆంక్షలను సడలించింది.

ఈ నేపథ్యంలో సాంకేతికత, కీలక ఖనిజాల సరఫరా విషయంలో ఏకపక్ష ఆధిపత్యానికి వ్యతిరేకంగా మోదీ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదు

**మొదటిపేజీ తరువాయి**

కాదని.. ఇవాళ ఉండి రేపు పోవచ్చని వ్యాఖ్యానించారు. అయితే ఇచ్చిన మాటకు మాత్రం తాము కట్టుబడి ఉంటామని చెప్పారు.

**పదవి కోసం రాజీపడలేదు**

కృతజ్ఞత అనేది తమ రక్తంలోనే ఉందని, తమ కుటుంబంలో ఆ విలువలు ఉన్నాయని కొండా మురళి అన్నారు. కొండా సురేఖతో సారీ చెప్పించాలని సూచించారని తెలిపారు. అయితే పదవి కోసం క్షమాపణ చెప్పేందుకు ఆమె అంగీకరించలేదన్నారు.

*"పదవి ఉంటే ఉండనీ.. పోతే పోనీ"* అనే వైఖరితో సురేఖ సారీ చెప్పలేదని మురళి పేర్కొన్నారు. రాజకీయాల్లో పదవుల కంటే ఆత్మగౌరవం, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం ముఖ్యమని ఆయన వ్యాఖ్యానించారు.

**ఎలా బతికామన్నదే ముఖ్యం**

జీవితంలో ఎన్ని రోజులు బతికామన్నది కాదని.. ఎలా బతికామన్నదే ముఖ్యమని కొండా మురళి అన్నారు. పదవుల కోసం తమ సిద్ధాంతాలను, మాటను మార్చుకునే ప్రసక్తి లేదని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీతో తమ అనుబంధం కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేసిన మురళి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ రాజకీయ లక్ష్యమని కార్యకర్తల సమావేశంలో వెల్లడించారు.

## ముంబయి లో ట్రాఫిక్ నరకం.. గడ్కరీకి తప్పని ఆలస్యం

**మొదటిపేజీ తరువాయి**

నవ్వులు విరిశాయి.

**అప్పట్లో నిర్మించినవే.. ఇప్పుడు సమస్యగా**

19952000 మధ్య మహారాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రిగా పనిచేసిన విషయాన్ని గడ్కరీ గుర్తుచేశారు. ఆ సమయంలో 55 ఫ్లైఓవర్లు, బాంద్రావర్లీ సీ లింక్, ముంబయిపుణె ఎక్స్‌ప్రెస్‌వేలను నిర్మించే అవకాశం తనకు లభించిందన్నారు. అయితే అప్పట్లో సరైన సాంకేతికత అందుబాటులో లేకపోవడంతో కొన్ని ప్రాజెక్టులను చేపట్టలేకపోయామని తెలిపారు.

నగరంలో వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో దశాబ్దాల క్రితం రూపొందించిన మౌలిక సదుపాయాలు ఇప్పుడు ఇబ్బందికరంగా మారుతున్నాయని గడ్కరీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇదే తరహా ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు పాత మౌలిక సదుపాయాలను ఆధునిక సాంకేతికతతో మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

**పాత ఫ్లైఓవర్లకు ప్రత్యామ్నాయం**

ఫ్లైఓవర్ల నిర్మాణంలో సంప్రదాయ డిజైన్లపైనే ఆధారపడకుండా కొత్త సాంకేతికతను ఉపయోగించాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు సూచించినట్లు గడ్కరీ తెలిపారు. పాత ఫ్లైఓవర్ల స్థానంలో అధునాతన నిర్మాణాలను తీసుకురావడం ద్వారా నగరాల్లో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చవచ్చన్నారు. పుణెలో ప్రతిపాదించిన రూ.50 వేల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టును కూడా గడ్కరీ ప్రస్తావించారు. ఒకే సెట్ పిల్లర్లపై అనేక స్థాయిల్లో ఫ్లైఓవర్లను నిర్మించేందుకు మలేషియా సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. అదే నిర్మాణంపై మెట్రో కారిడార్‌ను కూడా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

**భారత్ సామర్థ్యాలు.. అమెరికా వనరులు**

భారత్‌అమెరికా మధ్య సాంకేతిక సహకారం దేశం ఎదుర్కొంటున్న అనేక అభివృద్ధి సవాళ్లకు పరిష్కారం చూపగలదని గడ్కరీ అన్నారు. భారత్‌లో ఉన్న మానవ వనరులు, సాంకేతిక సామర్థ్యాలను అమెరికా వనరులు, నైపుణ్యంతో అనుసంధానిస్తే వివిధ రంగాల్లో మరింత వేగంగా అభివృద్ధి సాధించవచ్చని పేర్కొన్నారు.





## టిమ్స్‌లో రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్

- **రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ వర్క్‌షాప్ ప్రారంభం**
- **ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ**
- **టిమ్స్‌లో అత్యాధునిక రోబోటిక్ పరికరాల పరిశీలన**
- **మౌలిక వసతులపై నిపుణులతో మంత్రి చర్చ**
- **రోబోటిక్ సర్జరీ సేవల విస్తరణపై దృష్టి**
- **వైద్య రంగంలో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం**
- **ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలే లక్ష్యం**
- **తెలంగాణ వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం**
- **ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే ధ్యేయం**
- **కార్యక్రమంలో వైద్య శాఖ ఉన్నతాధికారులు, నిపుణులు**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)లో రాష్ట్రస్థాయి మల్టీ స్పెషాలిటీ రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్ ప్రారంభమైంది. తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం టిమ్స్‌కు చేరుకుని వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెడికల్ రోబోటిక్ పరికరాలు, మౌలిక వసతులను పరిశీలించారు. వాటి వినియోగంపై నిపుణులను అడిగి తెలుసుకున్నారు.

వైద్య రంగంలో రోబోటిక్ సర్జరీ సేవలను మరింత విస్తృతం చేయడం, ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంపై మంత్రి చర్చించారు. రాష్ట్రస్థాయి రోబోటిక్ సర్జరీ వర్క్‌షాప్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

**ఆధునిక సాంకేతికతతో వైద్యం**

తెలంగాణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు రాజనర్సింహ తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రోబోటిక్ సర్జరీ వంటి అధునాతన విధానాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**వైద్య నిపుణుల హాజరు**

ఈ కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ వాణి, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, డాక్టర్ బీరప్ప, డాక్టర్ విమల థామస్, డాక్టర్ సుధీర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో "సివిల్ కోడ్"..

- **2029 లోగా ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో యూసీసీ..**
- **ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతి చట్టాలు..**
- **ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగిస్తాం.**
- **అక్రమ వలసదారుల్ని గుర్తించి, తొలగిస్తాము..**
- **కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు..**

**ఢిల్లీ, (డీడీ9 వార్త):**

దేశవ్యాప్తంగా యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) అమలుపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సంచలన ప్రకటన చేశారు. 2029లోగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పాలిత 21 రాష్ట్రాల్లో యూసీసీ అమలు చేస్తామని ఆయన అన్నారు. ఆదివారం ముంబైలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మతంతో సంబంధం లేకుండా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి వ్యక్తిగత అంశాలకు ఒకే రకమైన చట్టపరమైన నిబంధనలు వర్తింపచేయాలనే ఉద్దేశంతో బీజేపీ "ఉమ్మడి పౌరస్మృతి"ని తీసుకువస్తోంది.

ఇప్పటికే పలు బీజేపీ రాష్ట్రాలు యూసీసీ చట్టాలు చేశాయి. మిగిలిన ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో కూడా దీనిని తీసుకువస్తామని అమిత్ షా ప్రకటించారు. దేశ భద్రతను ప్రస్తావిస్తూ.. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదంపై బీజేపీ ప్రభుత్వం "జీరో టాలరెన్స్" విధానాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. అన్ని రంగాల్లో భద్రతకు అధిక ప్రధానత్య ఇస్తున్నట్లు చెప్పారు. అక్రమ వలసదారుల్ని గుర్తించి, ఏరివేస్తామని చెప్పారు.

2014కు ముందు దేశం అవినీతి, కులతత్వం, కుటుంబ రాజకీయాల వల్ల ప్రభావితమైందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పనితీరు ఆధారంగా రాజకీయాలు కొనసాగుతున్నాయని అన్నారు. 'ఇండియా ఫస్ట్' అనే విధానం ద్వారా భారత విదేశాంగ, రక్షణ విధానాలకు బలమైన పునాది ఏర్పడిందని అన్నారు. ఒకప్పుడు "ఫ్రాజైల్ ఫైవ్" ఆర్థిక వ్యవస్థగా చూసిన భారత్, ఇప్పుడు ప్రపంచంలోనే టాప్5 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా చేరిందని అన్నారు. మణిపూర్‌లో ఎన్ఆర్సీ అమలుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తున్నట్లు అమిత్ షా ప్రకటించారు. మోడీ పుట్టిన రోజునే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలపై మాట్లాడుతూ.. భారత ప్రజాస్వామ్య దేశమని, ప్రజలు నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవిస్తుందని అమిత్ షా అన్నారు.





## ఘనం గా నాగులమ్మ ఆలయం లో పొట్ట పండగ

- **ఆదివాసి సంప్రదాయబద్ధంగా ఆదివాసి పూజారుల పూజలు**

**మంగపేట సెప్టెంబర్ 13డీడీ9 వార్త**

మంగపేట మండలం వాగొడ్డుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ నాగులమ్మ ఆలయంలో ఆదివాసిపూజరులు ,వడ్డెలు ఆదివాసీ సంప్రాదాయ బద్ధం గా పొట్ట పండగను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి యొక్క స్థంభాలను, గద్దెలను శుద్ధి చేస్తారు .అనంతరం నాగులమ్మ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి ఇంటి నుండి డోలి వాయిద్యాల నడుమ అమ్మవారికి కొత్తగా పండిన చిరు ధాన్యాలతో నైవేద్యం గా వొండి అమ్మవారికి సమర్పించారు.అనంతరం పొట్ట పండగలో ముఖ్య ఘట్టం పొట్ట దశ లో ఉన్న వివిధ రకాల చిరు ధాన్యాలను దండలుగా కట్టి ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగులమ్మ అమ్మవారియొక్క స్తంభానికి అదేవిధంగా సమ్మక్క,సారలమ్మ ఘడికమరాజు పగిడిద్దరాజు,గోవింద రాజు ఎర్రమ్మ,పోతు రాజుల యొక్క గద్దెల మీద ఉన్న స్తంభాలకు లకు దండలను కట్టి ప్రత్యేక పూజలు చేశారు .ఇలా చేయడాన్ని "ఎన్ను"కట్టడం గా పిలుస్తారు . అనంతరం ఆదివాసి పూజారులు ఆలయ ప్రాంగణంలో డోలి వాయిద్యాల నడుమ జాగారం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ మేనేజింగ్ ట్రస్ట్ ,ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి ఆధ్వర్యం లో జరగగా,నాగులమ్మ ప్రధాన పూజారి బాడిశ నాగ రమేష్,నవీన్,వడ్డెలు సోడి సత్యం,కుర్సంపుల్లయ్య, మడకం రమేష్,మడకం రాజేష్,చౌళం శాంత,కుర్సం వీరమ్మ,భవాని,మడకం నాగమణి,సంధ్య, సుప్రజ సోడి శ్రీను,కుర్సం నాగ సాంబయ్య పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు



## టవర్ ఉన్న నిరుపయోగం

- **పక్కనే ఉన్న గ్రామాలకు అందని జియో సిగ్నల్ మరియు నెట్**
- **కానీ వెంటనే రీఛార్జ్ చేసుకోండి జియో కస్టమర్ కేర్ నుండి పదే పదే ఫోన్ కాల్స్**

**సెప్టెంబర్ 13 డిడి 9 వార్త దుమ్ముగూడెం**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో గల ముసలమడుగు గ్రామం లో ఉన్నటువంటి జియో సెల్ టవర్ నిరుపయోగంగా మారింది. ఒక్క కిలోమీటర్ దూరంలో ఉన్నటువంటి గ్రామాలకు కనీసం సిగ్నల్ గాని నెట్ గాని రావడం లేదు. విచిత్రమ్ ఏమిటంటే నెట్టు ఉండదు సిగ్నల్ రాదు కానీ జియో కస్టమర్ కేర్ నుంచి మాత్రం పదే పదే కాల్స్ వస్తూ ఉంటాయి . రీచార్జ్ చేసుకోండి మీ రీఛార్జ్ టైం అయిపోయింది వెంటనే చేసేయండి ఇది వాళ్ల నుంచి కస్టమర్లకు వినబడే మాట. కానీ ఇక్కడ సిగ్నల్ వస్తుందా నెట్ వస్తుందా అనేది మాత్రం వాళ్లకి అవసరం లేదు అన్నట్టుగా జియో నెట్వర్క్ తయారయింది. నెట్వర్క్ ఓవర్ లోడ్ అవుతుందా అంటే అది కూడా లేదు. పోనీ ఈ టవర్ దగ్గరలో ఎత్తైన కొండలు దట్టమైన చెట్లు లేదా పెద్ద పెద్ద కట్టడాలు ఏమైనా ఉన్నాయా అంటే అవి కూడా లేవు. మరి ఎందుకు నెట్టు సిగ్నల్స్ అందడం లేదు జియో ప్రతినిధులకు మాత్రమే తెలియాలి. ఇప్పటికైనా జియో టవర్ కి సిగ్నల్ లెవెల్స్ పెంచి నెట్ మరియు సిగ్నల్ చుట్టుపక్కల గ్రామాలకు ఉపయోగపడేలాగా చూడాలని చుట్టుపక్కల గ్రామస్తులు యువత జియో టెలికాం కంపెనీ ప్రతినిధులను కోరుతున్నారు.

## మట్టి గణపతిని పూజిద్దాం.

- **పర్యావరణాన్ని కాపాడుకుందాం.**
- **మట్టి వినాయకుడి విగ్రహాల పంపిణి.**

**డిడి9వార్త / పెద్దపల్లి సెప్టెంబర్ 14:**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణ కేంద్రంలో మున్సిపల్ ఆధ్వర్యంలో పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి నియోజకవర్గ ప్రజలందరికి మట్టి వినాయకుడి విగ్రహాలను అందజేసిన తదుపరి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు ..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా రసాయన విగ్రహాలకు బదులు మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించాలని, వాటి వాడకాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,నుగుల్లా మల్లయ్య,కౌన్సిలర్లు మరియు కమిషనర్ మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.









# మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- **భక్తితో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి**
- **ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి**
- **మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మట్టి ప్రతిమల పంపిణీ**

**భద్రాచలం , సెప్టెంబరు 13 ( డిడి9 వార్త )**





వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సందేశాన్ని చాటుతూ మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో 500 మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి గణపతులను పూజించడం ద్వారా భక్తితో పాటు ప్రకృతిని పరిరక్షించవచ్చనే అవగాహనను ప్రజల్లో కల్పించారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి గణపతి ప్రతిమలను పూజించాలని కోరారు. "మట్టి గణపతినే పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుకుందాం.. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత" అని అన్నారు. మట్టి గణపతి ప్రతిమలను వినియోగించడం ద్వారా నిమజ్జనం సమయంలో జల వనరులపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.

చెరువులు, కాలువలు, నదులు తదితర జల వనరులను కాలుష్యం నుంచి కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన తెలిపారు. పండుగల సందర్భంగా భక్తి, సంప్రదాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. "మట్టి గణనాథుడిని పూజిద్దాం.. చెరువులను కాపాడుదాం.. మన భవిష్యత్తును పచ్చగా తీర్చిదిద్దుదాం" అని పిలుపునిచ్చారు. పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలతో తయారైన విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి ప్రతిమలను వినియోగించేలా ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేయడం ద్వారా పర్యావరణహిత వినాయక చవితికి ప్రజలను ప్రోత్సహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు, కోమటిరెడ్డి చైతన్య, పేరాల నాగేంద్ర, హరికృష్ణ, మహమ్మద్ బాబాజీ, బందా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తితో పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం రోటరీ క్లబ్ అధ్యక్షులు షేక్ అజీమ్

- **భద్రాచలంలో ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ**

**భద్రాచలం, సెప్టెంబరు 13 ( డిడి9 వార్త )**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శ్రీ సాయి సాగర్ సూపర్ మార్కెట్ ఎదురుగా ఉచిత గణేష్ విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎస్.కె. అజీమ్, కార్యదర్శి పాపినేని రాజేష్, కోశాధికారి కొత్త రామకృష్ణ, సలహాదారు ఎం. వీరయ్య మాట్లాడుతూ.. పండుగలను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణహితమైన గణేష్ విగ్రహాలను వినియోగించడం ద్వారా జల వనరులను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. భక్తితో పండుగ జరుపుకోవడంతో పాటు ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు అన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు శంకర్‌రెడ్డి, ప్రభాకర్ గుప్తా, దారా బాలాజీ, మోహన్‌కృష్ణ, సాగర్, సాంబశివరావు, నరసింహారావు, సీతారామిరెడ్డి, రమేష్, చలపతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.







## స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహిస్తున్న దృశ్యం కల్యాణంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

- **భక్తులతో సందడిగా మారిన రామాలయం**
- **వరుస సెలవులతో అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు**
- **వైభవంగా భద్రాద్రి రామయ్య నిత్య కల్యాణం**

**భద్రాచలం డీ డీ 9 వార్త, సెప్టెంబర్ 13:**



భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామివారిని ఆదివారం వరుస సెలవు దినాలు కావడంతో భద్రాచలానికి భక్తుల రాక గణనీయంగా పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకుని శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్నారు. నిత్య కల్యాణంతోపాటు స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. నిత్య కల్యాణంను ఆదివారం ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శ్రీరామ సేవా మండపంలో స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వామివారి నిత్య కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. నిత్య కల్యాణంలో భాగంగా ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ వంటి వైదిక కార్యక్రమాలను అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణ ఘట్టంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణ క్రతువును పూర్తి చేశారు. అనంతరం వేద పండితులు స్వామివారికి వేద ఆశీర్వచనం అందించారు. నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు సీతారాముల కల్యాణాన్ని కనులారా వీక్షించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. స్వామివారి కల్యాణ తలంబ్రాలు, ఆశీర్వచనాలను భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



## భక్తితో గణనాథుడిని కొలుద్దాం, బాధ్యతతో ఉత్సవాలు నిర్వహిద్దాం..

- **గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి..**
- **డీజేలకు అనుమతి లేదు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: సీఐ ముత్యం రమేష్.**

**సెప్టెంబర్ 13:డిడి 9 వార్త వెంకటాపురం.**

వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని వెంకటాపురం సీఐ ముత్యం రమేష్ గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు, యువత, భక్తులు సంయమనం పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. గణేష్ మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణలో సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని సీఐ సూచించారు. ఉత్సవాలు నిర్వహించదలచిన ప్రతి నిర్వాహకుడు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మండపాల ఏర్పాటు వల్ల ప్రజల రాకపోకలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద భద్రతా చర్యలు చేపట్టి నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ వైరింగ్, కనెక్షన్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ వంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా భద్రతా ప్రమాణాలను పాటించాలన్నారు.

**డీజేలకు అనుమతి లేదు**

గణేష్ ఉత్సవాల సందర్భంగా డీజే నిర్వహణకు అనుమతి లేదని సీఐ ముత్యం రమేష్ స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలు నిర్వహించడం, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడరాదని, ఉత్సవాలను సోదరభావంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం ఎస్ఐ కొప్పుల తిరుపతిరావు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చేతుల కష్టంతో సాగైపారిన సెలయేటి నీరు ..!

- వృథాగా పోతున్న సెలయేటి నీటిని ఒడిసిపట్టి.. బీళ్లుగా మారిన భూముల్లో బంగారు పంటలు
- ఐటీడీఏ చేయూత కోసం ఎదురుచూడలేదు..
- ప్రభుత్వ సాయం కోసం చేతులు చాచలేదు..
- గిరిజనుల శ్రమే సాగునీటి ఆధారం అయింది
- కష్టపడితే కరువునే తరిమికొట్టవచ్చని చాటిచెప్పిన గొత్తెకోయ గిరిజనులు
- ప్రభుత్వ చేయూత అందిస్తే మరిన్ని భూములు సాగులోకి తెస్తాం అంటున్న గిరిజనులు.!

**ఏటూరునాగారం క్రైం,డి డి 9 వార్త,**








కొండకోనల మధ్య నుంచి జలజల పారుతున్న సెలయేటి నీరు..ఏళ్ల తరబడి వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే లేడు.మరోవైపు సాగునీరు లేక గిరిజనుల భూములు బీళ్లుగా మారాయి. వర్షాలు కురిస్తేనే పంట..లేదంటే కరువు. బోరు బావులకు ఐటీడీఏ చేయూత కరువైంది.ప్రభుత్వ పథకాల కోసం ఎదురుచూస్తే పంట చేతికొచ్చే పరిస్థితి లేదు.దీంతో "మన చేతులతో మన భూములకు నీరు తెచ్చుకుందాం"అంటూ గొత్తె కోయ గిరిజనులు నడుం బిగించారు. ములుగు జిల్లా వెంకటాపురం సమీపంలోని కర్రెగుట్టల అవతల ఉన్న గొత్తెకోయ గూడెం పరిసరాల్లో ఇదే దృశ్యం కనిపిస్తోంది.కర్రెగుట్టలపై నుంచి కిందకు జలజల పారుతూ వృథాగా పోతున్న సెలయేటి నీటిని గిరిజనులు గుర్తించారు.ఆ నీటిని ఒడిసి పట్టుకుంటే తమ పొలాలకు సాగునీరు అందుతుందనే ఆలోచనతో ఇసుక కట్టలు నిర్మించి చిన్న కాలువలు ఏర్పాటు చేసి సెలయేటి నీటిని పొలాల వైపు మళ్లించారు.

**వృథా నీటికి ఇసుకకట్టలు.. బీళ్లకు సాగునీరు..!**

ఏళ్లుగా సాగునీరు లేక ఎండిపోయిన భూముల్లో ఇప్పుడు సెలయేటి నీరు పారుతోంది.గిరిజనులు స్వయంగా నిర్మించిన ఇసుకకట్టలు నీటిని నిల్వచేస్తుండగా,అక్కడి నుంచి కాలువల ద్వారా పొలాలకు నీటిని మళ్లిస్తున్నారు.దీంతో ఒకప్పుడు బీళ్లుగా కనిపించిన భూములు ఇప్పుడు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి.

**వరి,పత్తి,మిరప వేరుశనగ,ఆరుతడి పంటలు...**

సెలయేటి నీటిని పొలాలకు మళ్లించడంతో గిరిజన రైతులు వరి,పత్తి,వేరుశనగ,మిరపతో పాటు ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. పంటలకు తెగుళ్లు సోకకుండా తమకు తెలిసిన పద్ధతుల్లో మందులు వినియోగిస్తూ పంటలను కాపాడుకుంటున్నారు. పంటలు సక్రమంగా సాగుతుండటంతో గిరిజన రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది.

**ఎవరి సాయం లేకుండానే పంటలు పండించుకుంటూ..!**

చాలా ఏళ్లుగా వర్షాలు లేక భూములు బీళ్లుగా మారిపోయాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయం లేక ఉపాధి దొరకక తీవ్ర ఇబ్బందులు పడ్డామని చెబుతున్నారు. అయితే ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తూ కూర్చోకుండా ఐటీడీఏ కార్యాలయాల చుట్టూ తిరగకుండా తమ రెక్కల కష్టాన్నే నమ్ముకున్నారు.కర్రెగుట్టల నుంచి వృథాగా పారిపోతున్న నీటికి అడ్డుకట్టలు వేసి కాలువలు ఏర్పాటు చేసి ఆ నీటిని తమ భూములకు మళ్లించారు. ఫలితంగా నేడు అదే బీడు భూముల్లో పంటలు పండుతున్నాయి.

**ఐటీడీఏ వైపు చూడలేదు తమ కష్టాన్నే నమ్ముకున్నారు..!**

దట్టమైన అడవి కొండలు రవాణా సౌకర్యాల కొరత సాగునీటి సమస్య ఇలా ఎన్నో సమస్యల మధ్య జీవిస్తున్న గొత్తెకోయ గిరిజనులు "ఎవరైనా వచ్చి చేస్తారు"అంటూ ఎదురుచూడలేదు.ప్రభుత్వంపై ఆధారపడకుండా ఐటీడీఏ చేయూత కోసం వేచి చూడకుండా తమ చేతులతోనే నీటిని పొలాలకు చేర్చుకున్నారు.కొండల నుంచి వృథాగా పారిన నీరు గిరిజనుల చేతుల్లో సాగునీరైంది.బీళ్లుగా మారిన భూములు నేడు పచ్చని పంట పొలాలయ్యాయి.చేయూత కోసం ఎదురుచూడని గిరిజనుల శ్రమ పంటగా మారింది.ఇది కేవలం సాగు కథ కాదు కష్టపడితే కరువునే తరిమికొట్టవచ్చని చాటిచెప్పిన గొత్తెకోయ గిరిజనుల చేతుల కష్టం.

**ప్రభుత్వ చేయూత అందిస్తే మరిన్ని భూములు సాగులోకి..!**

తమ చేతుల కష్టంతో సెలయేటి నీటిని పొలాలకు మళ్లించుకుని పంటలు పండిస్తున్న గొత్తెకోయ గిరిజన రైతులకు ప్రభుత్వం,ఐటీడీఏ నుంచి సాంకేతిక సహకారం,శాశ్వత నీటి వసతులు,కాలువల అభివృద్ధి వంటి సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న ఇసుకకట్టలకు బదులుగా శాశ్వత నీటి నిల్వ,పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేస్తే మరింత విస్తీర్ణంలో సాగు చేసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. గిరిజనుల స్వయంకృషికి ప్రభుత్వ చేయూత తోడైతే బీడు భూములు మరింత పచ్చని పంట పొలాలుగా మారి,గిరిజన కుటుంబాలకు స్థిరమైన వ్యవసాయ ఆదాయం లభించే అవకాశం ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం చేయూతనిచ్చి గిరిజకనుల బతుకులకు అండగా నిలుస్తుందో లేదో చూడాలి మరి.

# వినాయక పండుగ పత్రిను విక్రయిస్తున్న దృశ్యం

- అంబేద్కర్ సెంటర్లో వినాయక విగ్రహాలను విక్రయిస్తున్న దృశ్యం
- భద్రాద్రిలో కోలాహలంగా వినాయక పండుగ సందడి
- విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో రద్దీగా మారిన ప్రధాన రహదారులు
- మండపాల ఏర్పాట్లలో గణేష్ మండళ్ల కమిటీలు

**భద్రాచలం డీ డీ 9 వార్త, సెప్టెంబర్ 13:**

భద్రాచలంలో వినాయక చవితి పండుగ సందడి ఆదివారం కోలాహలంగా నెలకొంది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు ప్రజల రాకపోకలతో సందడిగా మారాయి. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ ఉదయం నుంచే పట్టణంలోని పలు ప్రాంతాల్లో పండుగ వాతావరణం కనిపించింది. గణనాథుడి ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు భక్తులు ఉత్సాహంగా ఏర్పాట్లు చేసుకోవడంతో పట్టణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. యూబీ రోడ్డు, పాత మార్కెట్ , కూనవరం రోడ్డు, ఫారెస్టు ఆఫీసు ప్రాంతం, అంబేద్కర్ సెంటర్ , సినిమాహాలు రోడ్డు తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు, పూజా సామగ్రి, పత్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ఆకృతులు, పరిమాణాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు భక్తులను ఆకట్టుకున్నాయి. తమకు నచ్చిన గణనాథుడి ప్రతిమలను కొనుగోలు చేసేందుకు చిన్నారులు, యువత, మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి దుకాణాలకు తరలివచ్చారు. వినాయక విగ్రహాలతోపాటు పూజకు అవసరమైన పత్రి, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, దీప సామగ్రి తదితర వస్తువులను ప్రజలు కొనుగోలు చేశారు. దీంతో పూజా సామగ్రి విక్రయించే దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కిరాణా దుకాణాలు, పూజా సామగ్రి దుకాణాలు, పూల దుకాణాలు, బట్టల దుకాణాలతోపాటు ఇతర వ్యాపార సంస్థలు సైతం రద్దీగా కనిపించాయి. పండుగ నేపథ్యంలో వ్యాపార లావాదేవీలు పెరగడంతో వ్యాపార వర్గాల్లోనూ ఉత్సాహం నెలకొంది. మరోవైపు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మండపాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గణేష్ మండళ్ల కమిటీల ఆధ్వర్యంలో మండపాల అలంకరణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, పూజా కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లు చేపడుతున్నారు. యువత ప్రత్యేక ఆసక్తితో మండపాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో మండపాల నిర్మాణం పూర్తికాగా, మరికొన్ని ప్రాంతాల్లో చివరి దశ పనులు కొనసాగుతున్నాయి. పలువురు భక్తులు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ తమ ఇళ్లలోనే మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసుకుంటున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి మట్టి విగ్రహాలను తయారు చేసి పూజించేందుకు సిద్ధమవుతున్నారు. చిన్నారులు సైతం మట్టి వినాయక విగ్రహాల తయారీలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. దీంతో ఇళ్ల వద్ద కూడా వినాయక చవితి సందడి నెలకొంది. భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేస్తున్న భారీ గణనాథుడు ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భారీ విగ్రహంతోపాటు మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ గణనాథుడిని దర్శించుకునేందుకు పట్టణ ప్రజలతోపాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో నిర్వాహకులు ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారుల్లో విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో రద్దీ పెరిగింది. దీంతో రహదారులపై వాహనాల రాకపోకలు కూడా అధికమయ్యాయి. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సంబంధిత అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మొత్తంగా వినాయక చవితి పర్వదినంతో భద్రాచలం పట్టణం భక్తి, సందడి, పండుగ శోభతో కళకళలాడుతోంది.




# గణేష్ మండపాల వద్ద డీజేలు నిషేదం

- వాడితే కఠిన చర్యలు తప్పవు
- భదవ్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్

**భద్రాచలం డీ డీ 9 వార్త, సెప్టెంబరు 13**

భద్రాచలంలో ప్రారంభమైన గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని పోలీస్ శాఖ కీలక నిబంధనలు ప్రకటించింది. మండపాల వద్ద కాని, గణనాధుల నిమజ్జన సమయంలోకాని డీజే వాడొద్దని డీఎస్పీ అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. డీజేలు పెట్టుకునేందుకు తాము ఎవరికి అనుమతి ఇవ్వడం లేదని, కేవలం గణేష్ మండపాలకు మాత్రమే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అనుమతి మంజూరు చేస్తున్నామని తెలిపారు. డీజేల వలన ధ్వని కాలుష్యంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం సైతం దెబ్బతింటోందని కావున భక్తమండళ్ల నిర్వాహకులందరూ డీజే బాక్సులను ఏర్పాట చేయవద్దని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి డీజేలు ఏర్పాట చేస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# భద్రాచలం ఐటీడీఏపీవో బి.రాల్, సబ్‌కలెక్టర్లు

- ఆదివాసీ గిరిజన కుటుంబాలకు వినాయక చవితి శుభాకాంక్షలు
- ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట

**భద్రాచలం (డీడీ 9 వార్త), సెప్టెంబరు 13**

ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన కుటుంబాలతో పాటు గిరిజన గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, రెవెన్యూ, గిరిజన ఉద్యోగులు, గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు, తారతమ్యాలకు అతీతంగా హిందూ సంప్రదాయాలను అనుసరిస్తూ భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో ఇంటిల్లిపాది కలిసి జరుపుకునే పవిత్రమైన పండుగ వినాయక చవితి అని పేర్కొన్నారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. గిరిజన గ్రామాల్లో ప్రజలు తొమ్మిది రోజులపాటు వినాయక విగ్రహాలను వివిధ రకాలుగా అలంకరించి ఘనంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. పండుగను అందరూ సంతోషకరమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందితో పాటు ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతి గిరిజన కుటుంబం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మరోసారి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.






# పట్టణంలోని కూనవరం రోడ్డులో ప్రధాన రహదారిపై కుక్కల స్వైర విహారం

- ఇమ్మంది నాగేశ్వరరావు, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి
- భద్రాచలంలో వీధి కుక్కల బెడద
- గుంపులుగా సంచరిస్తున్న కుక్కలతో ప్రజల్లో భయాందోళన
- చిన్నారులు, మహిళలు, వృద్ధులే లక్ష్యంగా మారుతున్నారన్న ఆందోళన

**భద్రాచలం డీ డీ 9 వార్త , సెప్టెంబరు 13**

భద్రాచలం పట్టణంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులతోపాటు పలు కాలనీలు, నివాస ప్రాంతాలు, మార్కెట్ ప్రాంతాలు, పాఠశాలల పరిసరాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండటం ప్రజలను కలవరపెడుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కుక్కల గుంపులు రోడ్లపై స్వైర విహారం చేస్తుండటంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ పాఠశాలలకు వెళ్లే చిన్నారులు వీధి కుక్కలను చూసి బెంబేలెత్తిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లే సమయంలో, సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే సమయంలో చిన్నారులు ఒంటరిగా రోడ్లపై నడవాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల కుక్కలు ఒక్కసారిగా చిన్నారుల వెంట పరుగెత్తడం, మొరగడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటున్నారు. దీంతో పిల్లలు భయంతో పరుగులు తీయడం, రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మహిళలు, వృద్ధులు కూడా వీధి కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. ఉదయం నడకకు వెళ్లేవారు, ఆలయాలకు వెళ్లేవారు, నిత్యావసరాల కోసం బయటకు వచ్చే మహిళలు కుక్కల గుంపులను చూసి భయపడాల్సి వస్తోందన్నారు. వృద్ధులు ఒక్కసారిగా కుక్కలు వెంటపడితే పరుగెత్తలేని పరిస్థితిలో ఉంటారని, దీంతో కిందపడి గాయాలపాలయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని, అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లే వారు సైతం కుక్కల గుంపుల కారణంగా భయాందోళన చెందుతున్నారని చెబుతున్నారు. పట్టణంలోని పలు ప్రధాన రహదారులపై కుక్కలు గుంపులుగా చేరి ఒకదానితో ఒకటి ఘర్షణ పడుతున్న సందర్భాలు తరచూ కనిపిస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఈ సమయంలో రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కుక్కలు పరస్పరం కరుచుకుంటూ, ఒక్కసారిగా వాహనాల వైపు పరుగెత్తడం వల్ల ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. కొన్ని సందర్భాల్లో కుక్కలు వాహనాలకు అడ్డంగా రావడంతో వాహనదారులు కిందపడిపోయి గాయాలపాలైన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికెన్ దుకాణాలు, మాంసం విక్రయ కేంద్రాలు, హోటళ్లు, వ్యర్థాలు పేరుకుపోయే ప్రాంతాలు, మార్కెట్ పరిసరాలు, నివాస కాలనీల్లో వీధి కుక్కల సంచారం ఎక్కువగా కనిపిస్తోందని ప్రజలు చెబుతున్నారు. ఆహారం కోసం గుంపులుగా తిరుగుతున్న కుక్కలు కొన్ని సందర్భాల్లో ప్రజలపైకి రావడంతో భయానక వాతావరణం నెలకొంటోందని అంటున్నారు. పాఠశాలల పరిసరాల్లో కూడా వీధి కుక్కలు సంచరిస్తుండటం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇకనైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**తక్షణ చర్యలు తీసుకోవాలి బీఆర్ ఎస్ నాయకుడు ఇమంది నాగేశ్వరరావు**

ఇటీవల కాలంలో పలు ప్రాంతాల్లో కుక్కల దాడులకు సంబంధించిన ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో భద్రాచలంలో కూడా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి. కుక్కల బెడద మరింత పెరిగి ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడకముందే అధికారులు స్పందించాలి.

# పంచాయతీ రాజ్ చట్ట సవరణ పట్ల హర్షం వ్యక్తం చేసిన.. మణుగూరు మండల సర్పంచులు.

**మణుగూరు. సెప్టెంబర్ 13(డి డి 9వార్త)**

"గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు, పల్లెలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాలు తద్వారా దేశం అభివృద్ధి చెందుతుంది."అనే సూక్తిని నిజం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టానికి సవరణ చేసింది. దీని ప్రకారం స్థానిక గ్రామపంచాయతీ లకు వచ్చే సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా, ఆయా గ్రామపంచాయతీ ల ఖాతాలోనే జమ చేసుకుని ఆయా పంచాయతీల అభివృద్ధికి,అవసరాలకు తీర్మానం చేసి ఖర్చు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.ఇందుకోసం "పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 70(3) కు సవరణ చేస్తూ అసెంబ్లీ లో తీర్మానం చేసి అమోదం తెలిపినందుకు గాను మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ పిరినాకి నవీన్ అధ్యక్షతన సర్పంచులందరూ కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి,పంచాయతీ రాజ్ శాఖామాత్యులు సీతక్కకు, మరియు స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సమితిసింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు,కూనవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి ఎనిక శ్వేత,తోగ్గుడెం గ్రామపంచాయతీ సర్పంచ్ మడకం కృష్ణ,విప్పల సింగారం గ్రామ పంచాయతీ సర్పంచ్ పాల్వంచ రాములు, లంక మల్లారం గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం రమేష్, గుట్ట మల్లారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కారం పూజిత, బుగ్గ పంచాయతీ సర్పంచ్ చెట్టిపల్లి మాధవి, కట్టు మల్లారం సర్పంచ్ జగిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## మణుగూరు లో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ స్థాయి..

- **సేవ అభియాన్ కార్యశాల" సమావేశం.**

**మణుగూరు. సెప్టెంబర్ 13(డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,మణుగూరు పట్టణంలోని కిరాణా మర్చంట్ హాల్ నందు ఆదివారం నాడు భారతీయ జనతా పార్టీ పినపాక నియోజకవర్గస్థాయి "సేవ అభియాన్ కార్యశాల" సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొడియం బాలరాజు పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షులు ఈసాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొడియం బాలరాజు మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోడీ గారు గుజరాత్ ముఖ్యంత్రిగా, భారత ప్రధానిగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా "సేవ అభియాన్" పేరుతో కార్యక్రమాలను సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నియోజకవర్గ స్థాయిలో ఘనంగా జరపాలని, సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురష్కరించుకుని గ్రామ గ్రామాన జాతీయ జెండా ఆవిష్కరణ చేయాలని,
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలలోకి తీసుకెళ్తూ, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ, పార్టీని బలోపేతం చేయుటకు
గ్రామస్థాయి కార్యకర్త నుండి ప్రతి ఒక్కరు గ్రామ గ్రామాన తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రతి కార్యకర్త సైనికుడి లాగా నిరంతరం శ్రమించి పినపాక గడ్డపై కాషాయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో మండల అధ్యక్షులు పట్టా భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పున్నం బిక్షపతి, మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముస్కు శ్రీనివాసరెడ్డి, మాజి జిల్లా కార్యదర్శి ముత్యాల వెంకటేశ్వరరావు. జిల్లా కౌన్సిల్ మెంబెర్ లింగంపల్లి రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బీర రమేష్. మండల ప్రధాన కార్యదర్శి రవి గౌడ్. ఓబిసి జిల్లా కార్యదర్శి అన్న బత్తుల వెంకన్న, పినపాక మండల అధ్యక్షులు శివ ప్రసాద్, సీనియర్ నాయకులు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.




# చర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణ కేంద్రం వద్ద ఓటర్ల హడావుడి

- **సర్‌తో అయోమయంలో ఓటర్లు..!**
- **నోటీసులు ఇవ్వకుండానే పేర్లు తొలగించారా..?**
- **లబోదిబోమంటున్న ప్రజలు**

**భద్రాచలం (డీ డీ9 వార్త), సెప్టెంబరు 13**

ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతవుతుండటంతో భద్రాచలం సబ్‌కలెక్టరేట్ పరిధిలో ఓటర్లు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా అదే ప్రాంతంలో నివాసం ఉంటూ ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటున్న వారి పేర్లు సైతం ప్రస్తుతం జాబితాలో కనిపించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఓటర్ల జాబితా నుంచి పేర్లు ఎలా తొలగిస్తారంటూ సంబంధిత అధికారుల తీరుపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందా లేదా అని పరిశీలించుకున్న సమయంలోనే పలువురికి అసలు విషయం తెలిసిందని స్థానికులు చెబుతున్నారు. కుటుంబంలోని ఒకరి పేరు జాబితాలో ఉండగా మరొకరి పేరు కనిపించకపోవడం, ఒకే ఇంట్లో ఉన్న అర్హులైన ఓటర్లలో కొందరి పేర్లు మాత్రమే గల్లంతవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అసలు తమ పేరు ఎందుకు తొలగించారు..? ఎవరి ఆదేశాలతో తొలగించారు..? ఏ కారణంతో తొలగించారు..? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు లేకపోవడంతో ఓటర్లు అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించే ముందు సంబంధిత వ్యక్తికి నోటీసు ఇచ్చి, అభ్యంతరాలు ఉంటే తెలియజేసే అవకాశం కల్పించాల్సి ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. అయితే తమకు ఎలాంటి నోటీసులు అందలేదని పలువురు ఓటర్లు చెబుతున్నారు. నోటీసు ఇవ్వకుండా, కనీస సమాచారం లేకుండా పేర్లు గల్లంతైతే తమ ఓటు హక్కు పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయం దగ్గరపడిన తర్వాత విషయం తెలుసుకుంటే అప్పటికప్పుడు సమస్య పరిష్కారం కాకపోతే తమ ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఓటు గల్లంతైన వారు ఎక్కడికి వెళ్లాలి..? ఎవరిని సంప్రదించాలి..? గ్రామస్థాయిలో ఏ అధికారిని కలవాలి..? మండలస్థాయిలో ఎవరికి ఫిర్యాదు చేయాలి..? అనే విషయంలో స్పష్టత లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక కార్యాలయానికి వెళ్తే మరో అధికారిని సంప్రదించాలని చెప్పడం, అక్కడికి వెళ్తే మరో చోటుకు వెళ్లాలని సూచించడం వంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు అంటున్నారు. దీంతో తమ సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో తెలియక ప్రజలు లబోదిబోమంటున్నారు. ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన వారికి తిరిగి పేరు నమోదు చేసుకునేందుకు ఎలాంటి ప్రక్రియ చేపట్టాలో అధికారులు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది. నోటీసులు ఇచ్చిన అనంతరం ఏయే పత్రాలు సమర్పించాలి..? ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం లేదా ఇతర ఆధారాలు ఏమైనా అవసరమా..?



దరఖాస్తును ఎవరికి అందజేయాలి..? ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చా..? దరఖాస్తు చేసిన తర్వాత పేరు జాబితాలో ఎప్పుడు చేరుతుంది..? వంటి అనేక ప్రశ్నలు ప్రస్తుతం ఓటర్లను వేధిస్తున్నాయి. అధికారులు ఓటర్ల జాబితాను పారదర్శకంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు అందులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పేర్లు గల్లంతైన ఓటర్ల వివరాలను గుర్తించి, వారికి సమాచారం అందించి, సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచి ప్రజలు తమ పేర్లను పరిశీలించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అంటున్నారు. ఓటు హక్కు విషయంలో నిర్లక్ష్యం కారణంగా అర్హులైన పౌరులు తమ రాజ్యాంగబద్ధమైన హక్కును కోల్పోయే పరిస్థితి రాకూడదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. అధికారుల వద్ద సరైన సమాచారం అందుబాటులో లేకపోవడం, ఓటర్లకు అవగాహన కల్పించకపోవడం వల్లే ఈ అయోమయం నెలకొందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గల్లంతైన ఓట్లపై సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ఓటు వేయడానికి వెళ్లినప్పుడు జాబితాలో పేరు లేదని తెలిసి నిరాశ చెందే పరిస్థితి రాకుండా ముందుగానే సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతోపాటు, పేరు గల్లంతైన వారికి స్పష్టమైన సమాచారం అందించి అవసరమైన ప్రక్రియను సులభతరం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓటర్లలో నెలకొన్న అయోమయాన్ని తొలగిస్తారా..? లేక ప్రజలు అధికారుల చుట్టూ తిరగాల్సిందేనా..? అని ప్రజలు

## కాంగ్రెస్ మండల స్పోక్స్ పర్సన్‌గా ఆడే జైపాల్

**డిడి9 వార్త గుడిహత్నూర్:**

కాంగ్రెస్ పార్టీ గుడిహత్నూర్ మండల స్పోక్స్ పర్సన్‌గా ఆడే జైపాల్ నియమితులయ్యారు. డిసిసి అధ్యక్షుడు డాక్టర్ జాదవ్ నరేష్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ ఆశీస్సులతో తనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు జైపాల్ తెలిపారు.
మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని జైపాల్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరేలా అవగాహన కల్పించడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తొడసం దౌలత్ రావుతో పాటు సీనియర్ నాయకులు, కార్యకర్తలకు జైపాల్ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని చెప్పారు.





ADILABAD DISTRICT CONGRESS COMMITTEE

ORDER

Date:30-08-2026

As for the instructions/guidelines of the Hon'ble President AICC and President TPCC under the "Sangathan Srijan Abhiyan" to strengthen the Congress party, with the consultation of the concerned President, the Mandal Congress Committee appointment with approval of the DCC President has immediate effect.

Gudihathnoor Mandal Congress Committee

| S.NO | Name of the Person | Post | Village | Caste | Mobile No |
|---|---|---|---|---|---|
| 1 | Mohithe Maruthi | Vice President | Gudihathnoor | BC | 8332938221 |
| 2 | Dubbaka Naresh | Vice President | Shanthapur | SC | 8897068893 |
| 3 | Ade Jaipal | Spokesperson | Neradigonda-T | ST | 9966837120 |
| 4 | Power Raju | General Secretary | Tosham Tanda | ST | 9515822156 |
| 5 | Arif khan | General Secretary | Tosham | OC | 9440976734 |
| 6 | Kagne Ramkishan | General Secretary | Kolhari | BC | 9558911387 |
| 7 | Devanand Patil | General Secretary | Kamalapur | SC | 9010223277 |
| 8 | Kamble Shyam | Secretary | Kolhari | SC | 9347608574 |
| 9 | Rathod Ramesh | Secretary | Machapur | ST | 9492518775 |
| 10 | Ravindranath Munde | Secretary | Mannur | BC | 9014961975 |
| 11 | Shaik Raheem | Secretary | Suryaguda | BC | 9381055277 |
| 12 | Kumra Beershab | Secretary | Vaizapur | ST | 8074728351 |
| 13 | Meshram Jalender | Secretary | Mannur | ST | 6303047996 |
| 14 | Gedam Saikumari | Executive Member | Jawaharnagar | ST-W | 7997846204 |
| 15 | Khade Venkati | Executive Member | Seathagondi | SC | 9912506484 |
| 16 | Pendur Nagendra Babu | Executive Member | Belluri | ST | 7075279688 |
| 17 | Rathod Ganesh | Executive Member | Guruj | ST | 9032058573 |
| 18 | Durgam. Mahender | Executive Member | Chinthaguda | SC | 8978952410 |
| 19 | Kathle Madhav | Executive Member | Sambuguda | ST | 8328442569 |
| 20 | Urvetha Rohith | Executive Member | Soyamguda | ST | 7995712884 |

(Dr Naresh Jadhav)

# సీనియర్ కాంగ్రెస్ నాయకుల మనోభావాలను గౌరవించాలి

- **విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు**
- **పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి**
- **భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు**

**భద్రాచలం (డీడీ 9 వార్త), సెప్టెంబర్ 13:**

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ అవుతున్నాయని, వాటి ద్వారా గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి మార్గం సుగమమవుతోందని భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు అన్నారు. అయితే పార్టీ అధికారంలో లేని సమయంలోనూ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి, పార్టీ మనుగడ కోసం పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత పార్టీ అధిష్టానంపై ఉందని పేర్కొన్నారు.
ఆదివారం భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న సర్దార్ జలగం వెంగళరావు కాంగ్రెస్ పార్టీ భవన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పరిమి శ్రీనివాసరావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీని అంటిపెట్టుకుని పనిచేసిన నాయకులు, కార్యకర్తల సేవలను విస్మరించరాదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన సీనియర్ల కృషి, త్యాగాల ఫలితంగానే నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు.
సీనియర్ నాయకులు అడబాల వెంకటేశ్వర్లు, తమ్మల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నో ఏళ్లుగా పార్టీ జెండాను మోస్తూ, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమన్నారు. వారి సేవలు, త్యాగాలను గుర్తించి తగిన గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
కొమ్మనపల్లి ఆదినారాయణ మాట్లాడుతూ పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు, ఇతర కీలక బాధ్యతల భర్తీలో దీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నాయకులకు ముందుగా అవకాశం కల్పించాలని కోరారు. ఆ తర్వాత పార్టీలో నూతనంగా చేరిన వారికి వారి అర్హత, సామర్థ్యాన్ని బట్టి అవకాశాలు ఇవ్వాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.
భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల విషయంలో పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పరిమి శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారి మనోభావాలు దెబ్బతినే విధంగా నిర్ణయాలు తీసుకోవడం పార్టీ భవిష్యత్తుకు ఏమాత్రం మంచిది కాదన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలను విస్మరిస్తే క్షేత్రస్థాయిలో పార్టీపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.
గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి



తీసుకెళ్లడంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అధికారంలో లేని సమయంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ పార్టీ కోసం పనిచేసిన వారి కష్టాన్ని గుర్తించడం పార్టీ నాయకత్వం బాధ్యత అన్నారు. నిన్నటి వరకు పార్టీ కోసం పోరాడిన కార్యకర్తలు నేడు తమకు గుర్తింపు లేదనే భావనకు గురికాకుండా అధిష్టానం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.
కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన నాయకులు, కార్యకర్తలు తలదించుకునే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. సీనియర్ నాయకుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ అధిష్టానం వెంటనే ఈ అంశంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి అవకాశాలు కల్పించడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన సీనియర్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నామని స్పష్టం చేశారు.
ఇటీవల కొంతమంది నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ భవిష్యత్తుకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిణామాలు పార్టీని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర మనోవేదనకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న ప్రతి సీనియర్ నాయకుడు, కార్యకర్తకు సముచిత గౌరవం, గుర్తింపు కల్పించేలా పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.
ఈ విలేకరుల సమావేశంలో భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అడబాల వెంకటేశ్వర్లు, కొమ్మనపల్లి ఆదినారాయణ, తమ్మల్ల వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి సాంబశివరావు, తరుణ్ మిత్ర, కొలపూడి వరుణ్, కాపుల శ్రీను, వార్డు సభ్యులు సుబ్బారావు, సున్నం భూలక్ష్మి, సున్నం ఈశ్వరి, జగ్గా కుమారి, మహిళా నాయకురాలు పండాల సరిత, కాంగ్రెస్ నాయకులు శీలం రామ్మోహన్ రెడ్డి, బసవరాజు, గానుగ రమణ, ఐఎన్ టీయూసీ శ్రీనివాస్, సింగ్, మాధవరావు, గర్నేపల్లి అశోక్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్త ఓటు నమోదు మార్పులు, చేర్పులు

**ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 13: (డిడి9 వార్త న్యూస్):**

అదిలాబాద్ జిల్లా సోనాల మండలంలో కొత్త ఓటర్ నమోదు కార్యక్రమం యువతీ యువకులకు కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 దరఖాస్తులతో పాటు, ఓటరు వివరాలలో చిరునామా మార్పులు మొబైల్ నంబర్ మార్పులు/చేర్పులు ఫోటో మార్పులు ఇతర వివరాల మార్పులు/చేర్పులు కోసం దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. కార్యక్రమంలో సోనాల మండల తహసీల్దార్ అంకుల మల్లేష్, సార్ ఆర్.ఐ. సునీత మేడం, జి.పి.ఓ. పసుల రవి, జి.పి.ఓ యాస్మిన్ మరియు బి.ఎల్.ఓలు ఎం.డి. అజారుద్దీన్, మన్వార్ నాగరాణి, గౌర్రె సాయి అశోక్, ఉప్పు కృష్ణవేణి, దరఖాస్తులను స్వీకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని మనవి.







## పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడికి పౌర సన్మానం

- **విద్యా రంగానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేయాలని పిలుపు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 13(డీడీ9 వార్త):**

ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన ఎంబెల్లి శంకర్‌ను బోధన్ పట్టణాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ మహాలక్ష్మి కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. బోధన్ పట్టణానికి చెందిన వీరశైవ లింగాయత్ సమాజ సభ్యుడైన శంకర్ జిల్లా స్థాయి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల పట్టణ ప్రముఖులు, వివిధ వర్గాల ప్రజలు తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. ఈ సన్మాన మహోత్సవంలో వీడీసీ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ... జిల్లా అధ్యక్షుడిగా శంకర్ ఉపాధ్యాయ ఎదుర్కొంటున్న సుదీర్ఘ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, నిజామాబాద్ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి వినూత్న సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు గంగాధర్ రావు పట్వారి, పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాము, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షులు గోపి, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.




## శిరీష హత్య, అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- **విద్యా వ్యవస్థ, మీడియాలో మార్పులతోనే మహిళలకు రక్షణ**
- **పిఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.నాగమణి డిమాండ్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 13(డీడీ9 వార్త ) :**

హైదరాబాద్‌లో నర్సుగా సేవలందిస్తున్న గిరిజన అమ్మాయి శిరీషను దారుణంగా హత్య చేసి అత్యాచారానికి పాల్పడిన నిందితుడు ఎం.డి.సనావుల్లాను చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాలూర మండలం తగ్గెల్లి గ్రామంలో ఆదివారం పిఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగమణి మాట్లాడుతూ.. ఆగస్టు 28న రాఖీ పౌర్ణమి పండుగ నాడు శిరీష నివాసంలో ఒంటరిగా ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకుని, ఎదురుగా ఉన్న మెకానిక్ షాప్ ఉద్యోగి సనావుల్లా కిటికీ గుండా చొరబడి ఈ ఘాతుకానికి ఒడిగట్టాడని వివరించారు. ఈ తరహా ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలంటే సమాజంలో మూలమట్టంగా మార్పులు రావాలని స్పష్టం చేశారు. ఒక మనిషిని చంపేంతటి క్రూరమైన ఆలోచనలు రావడానికి కారణాలను విశ్లేషించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో పిల్లలకు బోధించే సిలబస్, సినిమాలు, మీడియా, రాజకీయ వేదికలు మరియు రోజువారీ భాషలో పురుషాధిక్య ధోరణి మారాలని, స్త్రీని కేవలం భోగవస్తువుగా చూసే విధానం నశించినప్పుడే మహిళలకు నిజమైన రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సునీత, ఈరమణి, నాగబాయి, శ్రీదేవి, విమల, అర్చన, లక్ష్మి, సంగీత, రాజమణి, సాయవ్వ, ఉజ్వల, కళావతి తదితరులు పాల్గొన్నారు.



# ఈఎన్‌టీ సమస్యలకు ఉచిత వైద్య సేవలు..!

- **అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్‌లో ఐదు రోజుల మెగా ఆరోగ్య శిబిరం**
- **సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు ప్రత్యేక శిబిరం..**
- **ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సేవలు**

**శాయంపేట,సెప్టెంబర్ 14, డిడి9వార్త**







ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను మరింత చేరువ చేయడంతో పాటు చెవి,ముక్కు,గొంతు సంబంధిత సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఆరెపల్లి కొత్తపేట రోడ్ లో ఉన్న అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్,ఆధ్వర్యంలో ఐదు రోజుల ప్రత్యేక ఈఎన్‌టీ సర్జరీ మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ ఆర్. శ్రవణ్‌కుమార్ (ఎంబీబీఎస్, ఎంఎస్-ఈఎన్‌టీ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 నుంచి 19వ తేదీ వరకు ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరం కొనసాగనుందని తెలిపారు.

**చెవి,ముక్కు,గొంతు సమస్యలకు ప్రత్యేక పరీక్షలు...**

ప్రస్తుత కాలంలో వాతావరణ మార్పులు, కాలుష్యం,అలర్జీలు తదితర కారణాలతో చాలామంది చెవి,ముక్కు,గొంతు సంబంధిత సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇటువంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే నిపుణులైన వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు,చికిత్స పొందడం అవసరమని పేర్కొన్నారు.ఈ ఆరోగ్య శిబిరంలో చెవిలో నొప్పి,వినికిడి తగ్గడం,చెవిలో మోగుడు శబ్దం, తరచుగా జలుబు రావడం,ముక్కు బ్లాక్ అవడం,ముక్కు నుంచి రక్తస్రావం,సైనసైటిస్, తలనొప్పి,గొంతు నొప్పి,మింగేటప్పుడు ఇబ్బందులు వంటి వివిధ ఈఎన్‌టీ సమస్యలకు నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సలహాలు అందించనున్నారు.

**ఉచిత ఓపీతో పాటు పలు ప్రత్యేక పరీక్షలు....**

శిబిరంలో పాల్గొనే వారికి ఉచిత ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. అలాగే అవసరాన్ని బట్టి ఎండోస్కోపీ పరీక్ష,వినికిడి పరీక్ష, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొంది.అదేవిధంగా రక్త పరీక్షలపై 50 శాతం డిస్కౌంట్ అందించనున్నట్లు వెల్లడించింది.ఈ అవకాశాన్ని వినియోగించుకోవడం ద్వారా ఈఎన్‌టీ సమస్యలతో బాధపడుతున్న వారు నిపుణులైన వైద్యుల సలహాలు పొందడంతో పాటు తమ ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత పొందవచ్చని తెలిపాయి.

**ఐదు రోజుల పాటు ప్రత్యేక వైద్య సేవలు..**

ఈ మెగా ఆరోగ్య శిబిరం సెప్టెంబర్ 15 నుంచి 19వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారు.కొత్తపేట క్రాస్ రోడ్,ఆరెపల్లి ప్రాంతంలోని అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్‌లో ఈ శిబిరం జరగనుంది.ఈ సందర్భంగా చెవి,ముక్కు, గొంతు సంబంధిత సమస్యలు ఉన్న వారు, చాలాకాలంగా సమస్యలతో బాధపడుతున్న వారు,వినికిడి తగ్గడం,ముక్కు బ్లాక్ అవడం, సైనసైటిస్,గొంతు సమస్యలు వంటి లక్షణాలు ఉన్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం సూచించింది.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న ఈ ఐదు రోజుల ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన వారు ముందస్తుగా ఈ నంబర్ 94598 75555 కు ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ తీసుకుని వైద్య సేవలు పొందాలని ఆసుపత్రి యాజమాన్యం కోరింది.





# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- **బషీరాబాద్‌లో అడిషనల్ కలెక్టర్ భుజంగరావు తనిఖీ**

**నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 13(డీడీ9 వార్త ) :**

కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ భుజంగరావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రోగ్రామ్ ప్రక్రియపై సంబంధిత అధికారులతో ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఏ తీరుగా సాగుతోందో సర్పంచ్ జమున మహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు సేకరించారు. అనంతరం గ్రామానికి చెందిన బిఎల్ఓ లతో సమావేశమైన అడిషనల్ కలెక్టర్, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇంకా ఎన్ని నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయనే అంశంపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న నోటీసులన్నింటినీ ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. గ్రామ స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. ఈ సమీక్షా కార్యక్రమంలో ఆర్ఐ శరత్, పలువురు బిఎల్ఓలు, వార్డు సభ్యుడు రాకేష్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్

- **భక్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం కానుక**

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం సెప్టెంబర్ 13: (డిడి 9 వార్త న్యూస్):**



సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం ప్రజా పాలనకు నిదర్శనం బోథ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆలపాటి అచ్యుతానంద్‌రెడ్డి గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని బోథ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆలపాటి అచ్యుతానంద్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గణేశ్ ఉత్సవాల నిర్వాహకులపై విద్యుత్ బిల్లుల భారం లేకుండా చేయడం ద్వారా ప్రభుత్వం భక్తుల సౌకర్యానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గణేశ్ మండపాల నిర్వాహకులు సంబంధిత విద్యుత్ అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందాలని అచ్యుతానంద్‌రెడ్డి సూచించారు. మండపాల వద్ద విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే మండపాల వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లలో ముందుగానే తెలియజేయాలని నిర్వాహకులకు సూచించారు. దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులను నివారించడంతో పాటు, భక్తుల భద్రతకు అవసరమైన చర్యలను పోలీసులు మరింత సమర్థంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు.

# ప్రజలకు సురక్షిత తాగునీరే లక్ష్యం

- **భీంగల్ 5వ వార్డులో బోరు మోటార్ ప్రారంభం**

**నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 13(డీడీ9 వార్త ) :**

భీంగల్ పట్టణం 5వ వార్డు బోయ గల్లిలోని జండా గల్లి వద్ద ఏర్పాటు చేసిన కొత్త బోరు మోటార్‌ను కౌన్సిలర్ బోదిరే లావణ్య నరసయ్య శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు మున్సిపల్ 15వ ఆర్థిక సంఘం నిధులతో మోటార్ అమర్చినట్లు వెల్లడించారు. వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లూరు లింబాద్రి, లోకేష్, రఘు, రాకేష్, ఆకుల సుజాత, గంగామణి పాల్గొన్నారు.



# లారీ ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

- **సుమారు 50 మీటర్ల మేర ఈడ్చుకెళ్లిన లారీ**
- **మృతురాలి ఆచూకీ కోసం పోలీసుల దర్యాప్తు**

**భద్రాచలం, సెప్టెంబరు 13 (డిడి9 వార్త)**

భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి రోడ్డులో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సినిమా హాల్ ఎదురుగా రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని మహిళను లారీ ఢీకొట్టింది. అనంతరం లారీ మహిళను కొంతదూరం ఈడ్చుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు లారీని అడ్డుకుని నిలిపివేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మృతదేహం తీవ్రంగా దెబ్బతినడంతో గుర్తించడం కష్టంగా మారింది. మృతురాలు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారనే వివరాలు తెలియరాలేదు. పోలీసులు మృతురాలి గుర్తింపుపై ఆరా తీస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





# హస కొత్తూర్ లో అడిషనల్ కలెక్టర్ తనిఖీ

**నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 13(డీడీ9 వార్త ) :**

కమ్మర్ పల్లి మండలం హస కొత్తూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్ నోటీసుల పంపిణీ ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ భుజంగారావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్ నోటీసుల పంపిణీ సరళిని పరిశీలించిన ఆయన, ఫామ్ 6, 7, 8 దరఖాస్తుల స్వీకరణపై బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నలిమెల గంగారెడ్డి, ఉప సర్పంచ్ ఏనుగు మనోహర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎడ్ల శ్రీకాంత్, బిఎల్ఓలు పాల్గొన్నారు.



# మట్టి విగ్రహాలతోనే పర్యావరణానికి రక్షణ

- **మట్టి విగ్రహాలతోనే పర్యావరణానికి రక్షణ**
- **బోధన్‌లో ఉచితంగా 5 వేల మట్టి ప్రతిమల పంపిణీ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 13(డీడీ9 వార్త ) :**

వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని బోధన్ ఆర్డీవో విజయ కుమారి, ఏసీపీ శ్రీనివాస్ కోరారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి ఆధ్వర్యంలో ఆదివారం బోధన్ పట్టణంలోని అంకు టవర్స్ వద్ద ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సీఐ వెంకటనారాయణ, తహసీల్దార్ విట్టల్, లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు బసవేశ్వర రావు, వేమూరి లక్ష్మితో కలిసి అధికారులు ప్రారంభించారు. లయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో 5 వేల మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేయడాన్ని అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షులు అంకు దామోదర్, ట్రాన్స్కో ఏఈ నాయిని కృష్ణ, లయన్స్ క్లబ్ బోధన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఆచన్ పల్లి అధ్యక్షులు దుర్గారావు, ప్రతినిధులు రమణారెడ్డి, గాంధీ, వై. శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, ఇల్తెపు శంకర్, అనంతలక్ష్మి, జమీల్ సైబర్, హరి బాబు తదితరులు పాల్గొన్నారు.




# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి

- **నిబంధనలు పాటించాల్సిందే: బోధన్ సీఐ వెంకటనారాయణ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 13(డీడీ9 వార్త ) :**




గణేష్ ఉత్సవాల వేళ మండపాల వద్ద నిర్వాహకులు పోలీస్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని బోధన్ టౌన్ సీఐ వెంకటనారాయణ పిలుపునిచ్చారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా లౌడ్ స్పీకర్లు వాడడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. రహదారులను మూసివేసి మండపాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని, ట్రాఫిక్ సజావుగా సాగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనల నివారణకు సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు రాత్రి వేళల్లో కమిటీ సభ్యులు నిఘా ఉంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణను పాటిస్తూ మట్టి వినాయకులను పూజించి ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

- **ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా**
- **మట్టి వినాయకులనే పూజించాలని పిలుపు**

**నిజామాబాద్ జిల్లా (డీడీ9 వార్త ) :**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించే ఆదిదేవుడైన వినాయకుని ఉత్సవాలను జిల్లా ప్రజలంతా శాంతియుత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ గణేష్ చతుర్థి పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలు నింపాలని, లంబోదరుని కృపాకటాక్షాలతో జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అభిలషించారు. పర్యావరణానికి హాని కలగకుండా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలని సూచించారు. ప్రకృతి సమతుల్యతను కాపాడుకునే బాధ్యత సమాజంలో మన అందరిపై ఉందని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు.





# లోక్ అదాలత్‌లో 6,649 కేసులు పరిష్కారం

- **సైబర్ బాధితులకు రూ.24 లక్షలు రీఫండ్**
- **సిబ్బందిని అభినందించిన సీపీ పి.సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా, (డీడీ9 వార్త ) :**

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని, రాజీపడే అవకాశం ఉన్న 6,649 కేసులను ఇరు వర్గాల అంగీకారంతో పరిష్కరించినట్లు జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన ఐపిసి, బీఎన్ఎస్, ఈపెట్టీ, ట్రాఫిక్ డిడి కేసులతో పాటు 71 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల బారినపడి డబ్బులు పోగొట్టుకున్న బాధితులకు లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం చేకూర్చామని, రూ.24 లక్షల 2 వేల 552ల నిధులను తిరిగి బాధితులకు అందజేసేలా బ్యాంక్ నోడల్ అధికారులకు ఉత్తర్వులు పంపినట్లు పేర్కొన్నారు. రాజీ మార్గమే రాజా మార్గమని, క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్ అదాలత్ మంచి అవకాశమని సీపీ తెలిపారు. జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు శ్రమించిన సిసిఆర్‌బి, సైబర్ సెల్, కోర్టు డ్యూటీ సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.



## వంగ రాజేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన యువకులు

- **సిద్దిపేట లో వివిధ వార్డుల నుంచి వచ్చిన యువకులు**

**సిద్దిపేట డీడీ9 వార్త**

ప్రముఖ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి ని కలిసేందుకు స్థానిక సిద్దిపేట పట్టణ వివిధ వార్డుల నుంచి యువత భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి యువతను అత్యంత ఆత్మీయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.
యువతతో ఎంతో స్నేహపూర్వకంగా గడిపిన ఆయన, వారి ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు మరియు అభిప్రాయాలను శ్రద్ధగా ఆలకించారు. యువత తనపై చూపుతున్న అభిమానం మరియు ఆత్మీయత పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... యువత సమాజానికి వెన్నెముక అని, వారి అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. యువతకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి మరియు భవిష్యత్తు అవకాశాలకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వివిధ వార్డుల నుంచి యువకులు, మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మధిర సాయి నగర్‌లో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

**మధిర, డీడీ9 వార్త:**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మధిర పట్టణంలోని సాయి నగర్ కాలనీలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత జంగా గురునాథరెడ్డి ఆధ్వర్యంలో, రుద్రపోగు శ్రీను సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రంగరావు హాజరయ్యారు.
ఈ సందర్భంగా రంగరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతి విగ్రహాలను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజలు పర్యావరణహితమైన గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు.
జంగా గురునాథరెడ్డి మాట్లాడుతూ, ప్రజలు మరియు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.
ఈ సందర్భంగా గురునాథరెడ్డిని పిఆర్టియు మధిర మండల శాఖ మరియు సాయి నగర్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు డి. వెంకటేశ్వర్లు, జిల్లా బాధ్యులు సిహెచ్. రవికుమార్, కొమ్ము శ్రీనివాసరావు, పిఆర్టియు మండల అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, ఎర్రుపాలెం పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి బాబురావు, మర్రి కృష్ణయ్య, తెల్ల మేకల శ్రీను, ఎం. నాగేశ్వరరావు, సిహెచ్. లెనిన్ బాబు, మహిళా ఉపాధ్యాయులు లక్ష్మీ రాజ్యం, నాగమణి పాల్గొన్నారు.



## పద్మ చక్ర అవార్డు గ్రహీతలకు ఎమ్మెల్యే సంజయ్ అభినందనలు

**జగిత్యాల , డీడీ9 వార్త**

జగిత్యాల రూరల్ మండలం అంతర్గామ్ గ్రామానికి చెందిన ఎల్లాల సరిత గోపాల్ రెడ్డిలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అభినందించారు. శ్రీ లలిత ఆల్టర్నేటివ్ థెరపీ సెంటర్ ద్వారా ప్రజలకు మందులు లేని వైద్య విధానంలో శారీరక, మానసిక ఆరోగ్య సేవలు అందిస్తూ చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా వారు పద్మ చక్ర అవార్డును అందుకున్నారు.హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రులు బాబు మోహన్, వేణుగోపాల చారి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆదివారం అంతర్గాం గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లి శాలువాతో సత్కరించి అభినందించారు. సామాజిక సేవల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు చర్యలు

**జవహర్ నగర్, సెప్టెంబర్ 13, (డీడీ9 వార్త):**

జవహర్ నగర్ బీసీ ఐక్యవేదిక కార్యాలయంలో ఆదివారం జవహర్ నగర్ బీసీ ఐక్యవేదిక సమావేశం ఆ సంఘ అధ్యక్షుడు మారోజు సోమచారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం బీసీ ఐక్య వేదిక జవహర్ నగర్ అధ్యక్షులు మారోజు సోమాచారి మాట్లాడుతూ... బీసీల అందరం ఐక్యంతో ఉండి బీసీల ఆత్మగౌరవ ప్రతిక అయినా సామాజిక విప్లవకారుడు బీసీ ఆరాధ్య దైవం మహాత్మ జ్యోతిరావు పూలే,సావిత్రిబాయి పూలే జంట విగ్రహాలను జవహర్ నగర్ ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు,ఈ సమావేశంలో హాజరైన బిసి ఐక్య వేదిక ముఖ్య సలహాదారులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కొండల్ ముదిరాజ్, పిన్నోజు సుధాకర్ ఆచారి, ప్రధాన కార్యదర్శి శనిగారం నరసింహ,ఉపాధ్యక్షులు గొడుగు వేణు, బండ కింది ప్రసాద్ గౌడ్ ,రాజు యాదవ్, మారోజు



రమేష్‌బాబు,కర్నే సురేందర్,కార్యదర్శులు రాం బ్రహ్మచారి, పుల్లయ్య చారి, వల్లపు మల్లేష్ వడ్డెర, దుర్గేష్, గాలయ్య చారి, విశ్వబ్రాహ్మణ సీనియర్ నాయకులు సదానంద చారి, ఆదర్శ్ నగర్ విశ్వబ్రాహ్మణ సంఘం గ్రామర్ చారి,నవీన్ చారి, విశ్వకర్మ హక్కుల సాధన సమితి,వడ్ల యాదగిరి చారి,దిగోజు బ్రహ్మచారి,కోశాధికారి యాదగిరి చారి,నాగరాజు చారి, భైరవ చారి, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీజేఆర్ నగర్ గౌడ సంఘానికి నూతన కమిటీ ఎన్నిక,

- **అధ్యక్షుడిగా దుబ్బాక రవీందర్ గౌడ్**

**జవహర్‌నగర్, సెప్టెంబర్ 13 (డీడీ9 వార్త):**

జవహర్ నగర్ లోని బీజేఆర్ నగర్ పరిసర కాలనీలకు చెందిన గౌడ కులస్తులు ఆదివారం బి జె ఆర్ నగర్ లో సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా దుబ్బాక రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా మెరుగు బిక్షపతిగౌడ్,తండా ప్రభాకర్ గౌడ్,ప్రధాన కార్యదర్శిగా బండకింది భరత్ గౌడ్, కోశాధికారిగా దంతూరి శివకుమార్ గౌడ్,సహాయ కార్యదర్శిగా దుబ్బాక నవీన్ గౌడ్ ఎన్నికయ్యారు.సలహాదారులుగా వడ్లకొండ వెంకటేష్ గౌడ్,మొక్తల శంకరయ్య గౌడ్,పుట్ట బిక్షపతి గౌడ్,కార్యవర్గ సభ్యులుగా బి.ఈశ్వర్ గౌడ్,బి.కృష్ణ గౌడ్, ఎన్.వెంకన్న గౌడ్,దంతూరి రజినీకుమార్ గౌడ్ ఎంపికయ్యారు.
ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దుబ్బాక



రవీందర్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘంలోని సభ్యులందరి అభిప్రాయాలను తీసుకుంటూ, అందరినీ కలుపుకొని సంఘాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని అన్నారు.

## సీసీ రోడ్డు పనులను పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్...

**మెదక్ సెప్టెంబర్ 13 (డీడీ9 వార్త)**

మెదక్ పట్టణం నవాపేట్ వీధిలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు పనులు నాణ్యత తో చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల సమయంలో స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని నరేష్ గౌడ్ తెలిపారు.



మిగిలిన ప్రాంతాల్లో కూడా అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని పేర్కొన్నారు.



## మెదక్ సీఎస్ఐ చర్చిలో ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు

**మెదక్: సెప్టెంబర్ 13 (డీడీ9 వార్త)**

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. చర్చికి పెద్ద సంఖ్యలో క్రైస్తవ భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెస్బీటర్ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో వాక్య పరిచర్య నిర్వహించారు. యేసుక్రీస్తు బోధనలు, ఆయన చూపిన ప్రేమ, కరుణ, సేవా మార్గాలను వివరిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. అనంతరం స్త్రీల మైత్రి సభ్యుల ఆధ్వర్యంలో యేసుక్రీస్తు జీవితంలోని ఓ ముఖ్యమైన సంఘటన ను నాటక రూపంలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# బాక్స్ బయటి నుంచి మెస్సీ మ్యాజిక్.. అద్భుతమైన గోల్‌తో అందరినీ మెస్మరైజ్ చేసిన సాకర్ దిగ్గజం!

- మేజర్ లీగ్ సాకర్‌లో ఇంటర్ మయామి, నాష్‌విల్లే మ్యాచ్ 2-2తో డ్రా
- బాక్స్ బయటి నుంచి అద్భుత గోల్‌తో మెస్సీ మయామికి ఆధిక్యం
- ఈ సీజన్‌లో 19వ గోల్ నమోదు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచిన మెస్సీ
- నాష్‌విల్లే తరఫున రెండు గోల్స్ చేసిన సామ్ సరిడ్జ్
- ఇంజురీ టైమ్‌లో గోల్ చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించిన నాష్‌విల్లే

**డీడీ9 వార్త :**

మేజర్ లీగ్ సాకర్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ మరోసారి తన మాయాజాలాన్ని ప్రదర్శించాడు. నాష్‌విల్లే ఎస్సీతో జరిగిన మ్యాచ్‌లో పెనాల్టీ బాక్స్ బయటి నుంచి అద్భుతమైన గోల్ కొట్టి తన జట్టు ఇంటర్ మయామిని ఆధిక్యంలో నిలిపాడు. అయినప్పటికీ, ఈ మ్యాచ్‌లో మయామికి విజయం దక్కలేదు. ఆఖరి నిమిషంలో నాష్‌విల్లే గోల్ చేయడంతో మ్యాచ్ 22తో డ్రాగా ముగిసింది.

నిన్న జరిగిన ఈ మ్యాచ్ ఆరంభంలోనే నాష్‌విల్లే దూకుడు కనబరిచింది. ఆట మొదలైన నాలుగో నిమిషంలోనే సామ్ సరిడ్జ్ గోల్ చేసి నాష్‌విల్లేకు 10 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, ఇంటర్ మయామి వెంటనే తేరుకుంది. 19వ నిమిషంలో మెస్సీ కొట్టిన కార్నర్ కిక్‌ను అడ్డుకోబోయిన నాష్‌విల్లే డిఫెండర్ రీడ్ బేకర్‌వైటింగ్, పొరపాటున బంతిని తమ సొంత గోల్ పోస్టులోకి పంపడంతో స్కోరు 11తో సమమైంది.

రెండో అర్ధభాగంలో మెస్సీ తన మార్క్ ఆటతో అభిమానులను ఉర్రూతలూగించాడు. 62వ నిమిషంలో సహచర ఆటగాడు రోడ్రిగో డి పాల్ నుంచి పాస్ అందుకున్న మెస్సీ, పెనాల్టీ ఏరియా బయటి నుంచి తన ఎడమ కాలితో కొట్టిన అద్భుతమైన షాట్ నేరుగా గోల్ నెట్‌లోకి దూసుకెళ్లింది. ఈ గోల్‌తో ఇంటర్ మయామి 21 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ సీజన్‌లో మెస్సీకి ఇది 19వ గోల్ కాగా, టాప్ స్కోరర్‌గా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. 2023లో మయామి జట్టులో చేరినప్పటి నుంచి నాష్‌విల్లేపై ఆడిన 14 మ్యాచ్‌లలో మెస్సీకి ఇది 17వ గోల్ కావడం గమనార్హం.

మ్యాచ్ మయామి గెలుస్తుందని అంతా భావిస్తున్న తరుణంలో నాష్‌విల్లే అనూహ్యంగా పుంజుకుంది. ఇంజురీ టైమ్‌లో సామ్ సరిడ్జ్ మరోసారి గోల్ చేసి స్కోరును 22తో సమం చేశాడు. దీంతో గెలుపు అంచుల వరకు వచ్చి మయామి డ్రాతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఫలితంతో ఈస్టర్న్ కాన్ఫరెన్స్ పట్టికలో అగ్రస్థానంలో ఉన్న నాష్‌విల్లే కంటే ఇంటర్ మయామి 9 పాయింట్ల వెనుకంజలో నిలిచింది. రెగ్యులర్ సీజన్‌లో మయామికి




# మోదీజీ.. హ్యాట్సాఫ్.. అంతర్జాతీయ దౌత్యం అంటే ఇదే

- బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ దౌత్యానికి రవిశాస్త్రి జేజేలు
- పుతిన్, జిన్‌పింగ్‌తో కలిసి మోదీ మొక్కలు నాటుతున్న ఫొటో షేర్
- భారతీయుడిగా ఎన్నడూ ఇంత గర్వపడలేదంటూ ట్వీట్
- ఇది మునుపెన్నడూ చూడని దౌత్యమని ప్రధానిని కొనియాడిన శాస్త్రి

**డీడీ9 వార్త :**

భారత క్రికెట్ జట్టు మాజీ కోచ్, ప్రముఖ వ్యాఖ్యాత రవిశాస్త్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ ప్రదర్శిస్తున్న అంతర్జాతీయ దౌత్యనీతిని కొనియాడాడు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఓ ఆసక్తికర పోస్ట్ చేశాడు.

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో కలిసి ప్రధాని మోదీ మొక్కలు నాటుతున్న ఫొటోను రవిశాస్త్రి పంచుకున్నాడు. సదస్సు జరుగుతున్న 'భారత్ మండపం'లో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ ఫొటోను షేర్ చేస్తూ.. "ఒక భారతీయుడిగా నేనెప్పుడూ ఇంత గర్వంగా ఫీల్ అవ్వలేదు. అధ్యక్షుడు పుతిన్, అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, మన అద్భుతమైన ప్రధాని నరేంద్ర మోదీ అంతా మాతృభూమి భారత్‌లో ఒకేచోట ఉన్నారు. ఇది మునుపెన్నడూ చూడని అంతర్జాతీయ దౌత్యం. మోదీ జీ.. మీకు నా హ్యాట్సాఫ్" అంటూ తన పోస్టులో పేర్కొన్నాడు.

భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో 18వ బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాల అధినేతలు ఇందులో పాల్గొన్నారు. సదస్సులో భాగంగా నిన్న బ్రిక్స్ నేతలు 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'ను ఆమోదించారు.

సదస్సు చివరి రోజైన నేడు ప్రధాని మోదీ పలు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ జాబితాలో దక్షిణాఫ్రికా, కజకిస్థాన్, ఫిలిప్పీన్స్, ఈజిప్ట్, బురుండి, ఉగాండా, నైజీరియా వంటి దేశాలు ఉన్నాయి. భారత్ తరఫున 80 టెస్టులు, 150 వన్డేలు ఆడిన రవిశాస్త్రి, ఆ తర్వాత భారత జట్టుకు హెడ్ కోచ్‌గా కూడా పనిచేశాడు. ప్రస్తుతం భారత క్రికెట్‌లో ఓ ప్రముఖ వ్యాఖ్యాతగా, విశ్లేషకుడిగా కొనసాగుతున్నాడు.




# షమీ వయసుపై చర్చ.. కోహ్లీ, రోహిత్‌లను చూపిస్తూ చోప్రా కౌంటర్

- టీమిండియాలో షమీ ఎంపికపై స్పందించిన మాజీ క్రికెటర్
- వయసు కారణంగా షమీని పక్కనపెట్టారన్న వాదన పూర్తిగా అసంబద్ధమన్న చోప్రా
- కోహ్లీ, రోహిత్‌లు ఆడుతున్నప్పుడు వయసు ఎలా కారణమవుతుందని ప్రశ్న
- ఫిట్‌గా లేకపోవడమే సమస్య తప్ప, వయసు కాదని పరోక్షంగా వ్యాఖ్య

**డీడీ9 వార్త :**



భారత సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీని వయసు కారణంగానే జట్టులోకి తీసుకోవడం లేదనే వాదనలను మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా తోసిపుచ్చాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి సీనియర్లు ఇంకా జట్టులో కొనసాగుతున్నప్పుడు, ఒక్క షమీ విషయంలోనే వయసును కారణంగా చూపడం సరికాదని స్పష్టం చేశాడు.

36 ఏళ్ల షమీ గత ఏడాదిన్నరగా పదేపదే గాయాల బారిన పడుతూ జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ యువ బౌలర్ల వైపు మొగ్గుచూపుతోంది. దీంతో షమీ కెరీర్ వయసు కారణంగానే ముగింపు దశకు వచ్చిందనే ప్రచారం జరుగుతోంది.

ఈ వాదనలపై తాజాగా స్పందించిన ఆకాశ్ చోప్రా "షమీకి వయసు ప్రతికూలంగా మారిందా? అది పూర్తిగా అసంబద్ధం. జట్టులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి అనుభవజ్ఞులను ఎంపిక చేస్తున్నప్పుడు, వయసు కారణంగా ఒకరిని తొలగించడంలో అర్థం లేదు. నా అంచనా ప్రకారం, షమీ ఎంపికలో వయసు అస్సలు కారణం కాదు. సెలక్టర్లు ఏదో ఒక రోజు కారణం చెబుతారు, కానీ అది మాత్రం వయసు అయి ఉండదు" అని ఒక వీడియోలో స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌తో షమీని పోల్చుతూ చోప్రా మరిన్ని విషయాలు వివరించాడు. "స్టార్క్ పూర్తి ఫిట్‌గా ఉంటూ నిరంతరం ఆడుతున్నాడు. జట్టులోకి వచ్చిన ప్రతీసారి బౌలింగ్ దాడిని ముందుండి నడిపించాడు. అతడి ఫామ్, ఫిట్‌నెస్, పదునుపై ఎలాంటి సందేహాలు లేవు" అని అన్నాడు. షమీ విషయంలో గాయాలు, ఫిట్‌నెస్ ప్రధాన సమస్యగా ఉన్నాయని పరోక్షంగా సూచించాడు.

షమీ చివరిసారిగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత జట్టుకు ఆడాడు. ఆ తర్వాత వరుస గాయాలతో బాధపడుతూ జట్టుకు అందుబాటులో లేకుండా పోయాడు.

# పాక్ పై క్లీన్‌స్వీప్.. డబ్ల్యూటీసీ రేసులో భారత్‌కు చేరువైన ఇంగ్లండ్

- పాకిస్థాన్‌పై 3-0 తేడాతో టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఇంగ్లండ్
- డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్‌కు చేరువైన ఇంగ్లీష్ జట్టు
- అట్టడుగు స్థానంలో మరింత దిగజారిన పాకిస్థాన్
- ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తొలి రెండు స్థానాల్లో కొనసాగింపు
- భారత్ కంటే ముందు నాలుగో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్

**డీడీ9 వార్త :**



పాకిస్థాన్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్ చేసింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన చివరి టెస్టులో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, సిరీస్‌ను 30తో కైవసం చేసుకుంది. ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) పాయింట్ల పట్టికలో ఇంగ్లండ్ తన ఆరో స్థానాన్ని పటిష్ఠం చేసుకోవడమే కాకుండా, ఐదో స్థానంలో ఉన్న భారత్‌కు రేటింగ్ పరంగా మరింత చేరువైంది. మూడో టెస్టులో 130 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్, జో రూట్, జోర్డాన్ కాక్స్ అర్ధశతకాలతో రాణించడంతో సునాయాసంగా విజయం సాధించింది. తమ సొంతగడ్డపై పాకిస్థాన్‌ను వైట్‌వాష్ చేయడం ఇంగ్లండ్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం.

ఈ విజయంతో ఇంగ్లండ్ డబ్ల్యూటీసీ పాయింట్ల సంఖ్య 74కు పెరిగింది. 16 మ్యాచ్‌ల అనంతరం వారి పర్సంటేజ్ ఆఫ్ పాయింట్స్ (PCT) 38.54 శాతానికి మెరుగుపడింది. గతంలో స్లో ఓవర్ రేట్ కారణంగా 14 పాయింట్ల కోతకు గురైన ఇంగ్లండ్, ఈ గెలుపుతో కాస్త ఊరట పొందింది. మరోవైపు, ఈ ఓటమితో పాకిస్థాన్ పరిస్థితి మరింత దిగజారింది. ఇప్పటికే పట్టికలో అట్టడుగున తొమ్మిదో స్థానంలో ఉన్న ఆ జట్టు పీసీటీ 16.67 శాతం నుంచి 14.81 శాతానికి పడిపోయింది. పాకిస్థాన్‌పై కూడా స్లో ఓవర్ రేట్ కారణంగా 8 పాయింట్ల కోత పడింది.

డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 80 పీసీటీతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, దక్షిణాఫ్రికా (75 పీసీటీ), న్యూజిలాండ్ (72.22 పీసీటీ) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఆశ్చర్యకరంగా బంగ్లాదేశ్ 55.56 PCTతో భారత్ కంటే ముందు నాలుగో స్థానంలో నిలిచింది. టీమిండియా 11 మ్యాచ్‌లలో 51.52 పీసీటీతో ఐదో స్థానంలో ఉంది. శ్రీలంక, వెస్టిండీస్ ఏడు, ఎనిమిది స్థానాల్లో ఉన్నాయి.

వచ్చే ఏడాది జూన్ 9 నుంచి 13 వరకు లండన్‌లోని ఓవల్ మైదానంలో జరిగే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు అర్హత సాధిస్తాయి.

# చాలా దూకుడైన వ్యక్తి.. గంభీర్ మనస్తత్వం ఎలాంటిదో చెప్పిన అయ్యర్

- హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో తనది బలమైన బంధమని చెప్పిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్
- గంభీర్ దూకుడు స్వభావం, ఆటగాళ్లకు స్పష్టతనిచ్చే తీరు జట్టుకు మేలు చేస్తుందని వెల్లడి
- గతంలో కేకేఆర్ తరఫున తామిద్దరం కలిసి ఐపీఎల్ టైటిల్ గెలిచామని గుర్తు చేసిన అయ్యర్
- ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌పై దృష్టి పెట్టామని, ఒక్కో మ్యాచ్‌ను సీరియస్‌గా తీసుకుంటామని స్పష్టీకరణ
- ఆసియా క్రీడల్లో పాల్గొనడంపై తొలిసారిగా ఆనందం వ్యక్తం చేసిన భారత కెప్టెన్

**డీడీ9 వార్త :**




ఆటకు సంబంధించినంత వరకు భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో తనకు బలమైన బంధం ఉందని, ఇది జట్టులో స్పష్టమైన కమ్యూనికేషన్‌కు, దూకుడైన ఆటతీరుకు ఉపయోగపడుతుందని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న టీ20 మ్యాచ్‌కు ముందు శనివారం జరిగిన మీడియా సమావేశంలో అయ్యర్ మాట్లాడాడు. తమ ఇద్దరి మధ్య ఉన్న అవగాహన జట్టుకు ఎంతో మేలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశాడు.

గతంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తరఫున 2024 ఐపీఎల్ సీజన్‌లో కెప్టెన్‌మెంటార్‌గా శ్రేయస్, గంభీర్ కలిసి పనిచేసి జట్టుకు టైటిల్ అందించిన విషయం తెలిసిందే. ఈ అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, గంభీర్ కోచింగ్ శైలిని అయ్యర్ ప్రశంసించాడు. "గంభీర్ చాలా దూకుడు స్వభావం ఉన్న వ్యక్తి. మైదానంలోకి అడుగుపెట్టాడంటే గెలుపు గురించే ఆలోచిస్తాడు. ప్రతి ఆటగాడు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని కోరుకుంటాడు. జట్టు సభ్యుల్లో నమ్మకాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాడు. ఎవరి పాత్ర ఏంటనే దానిపై స్పష్టత ఇస్తాడు" అని అయ్యర్ వివరించాడు.

ఆటగాళ్లతో వ్యక్తిగతంగా మాట్లాడి వారిని అర్థం చేసుకునే గంభీర్ విధానం అద్భుతమని శ్రేయస్ కొనియాడాడు. "ప్రతి ఆటగాడితో వ్యక్తిగత సంబంధాన్ని కొనసాగించడం కోచింగ్‌లో చాలా ముఖ్యం. ఎందుకంటే జట్టులోని ఒక్కొక్కరిది ఒక్కో శైలి. గౌతీ భాయ్ (గంభీర్) మనస్తత్వం, అతడి ఆలోచనా విధానం నాకు బాగా తెలుసు. మేం ఎన్ని ఎక్కువ మ్యాచ్‌లు గెలిస్తే, మా మధ్య బంధం అంత బలపడుతుంది" అని అయ్యర్ తెలిపాడు.

ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే సిరీస్ గురించి మాట్లాడుతూ, ప్రత్యర్థిని తేలిగ్గా తీసుకోవట్లేదని స్పష్టం చేశాడు. "మేం భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించట్లేదు. ప్రస్తుతం తొలి మ్యాచ్‌పైనే మా దృష్టి ఉంది. ఆఫ్ఘనిస్థాన్ బలమైన జట్టు. వారి ఆటగాళ్లకు ఐపీఎల్ ఆడిన అనుభవం వల్ల ఇక్కడి పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. మా సన్నద్ధత కూడా చాలా బాగుంది. ఆసియా క్రీడలకు ముందు ఇలాంటి నాణ్యమైన జట్టుతో ఆడటం మాకు మంచి అవకాశం" అని అయ్యర్ పేర్కొన్నాడు.

తొలిసారిగా ఆసియా క్రీడల్లో పాల్గొనడంపై శ్రేయస్ అయ్యర్ ఉత్సాహం వ్యక్తం చేశాడు. "ఇది నాకు, జట్టుకు చాలా ఉత్సాహకరమైన సమయం. గత ఆసియా క్రీడల్లో పాల్గొన్న కొందరు ఆటగాళ్లు ఇప్పుడు కూడా జట్టులో ఉన్నారు. అక్కడ ఇతర క్రీడలకు చెందిన అథ్లెట్లతో సంభాషించడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఒక దేశంగా వెళ్లి, విజయంతో తిరిగి రావాలని కోరుకుంటున్నాం" అని అయ్యర్ ముగించాడు.



# బియ్యం పురుగులు పడుతోందా? ఈ టిప్స్ పాటించండి..!

బియ్యంలో పురుగులు పడటం ఎంతో సహజం. ముఖ్యంగా తెల్లపురుగుల కారణంగా బియ్యం పాడవుతూ ఉంటుంది. ఆ తర్వాత బియ్యం నుంచి పురుగులను వేరు చేయడం ఎంతో కష్టతరంగా ఉంటుంది. అయితే అసలు బియ్యంలో పురుగులు పడకుండా ఏం చేయాలి? ఎటువంటి చిట్కాలు పాటించాలి? తదితర విషయాలను ఈ కథనంలో తెలుసుకుందాం..

**ఈ ఆకులను బియ్యంలో ఉంచండి..!**

బే ఆకులు బియ్యం పెట్టుకొనే కంటైనర్ లో ఉంచాలి. సహజంగా ఎండిన బే ఆకులు మార్కెట్ లో అందుబాటులో ఉంటాయి. వీటిని బియ్యం కంటెయినర్ లలో ఉంచాలి. ఓ నాలుగైదు ఆకులు ఉంచడం ద్వారా బియ్యం పురుగుపట్టే సమస్య తగ్గుతుంది. ఇక బియ్యం పురుగులు పట్టకుండా ఉండాలంటే లవంగాలు కూడా ఎంతో కీలకం. బే ఆకుల వలె, లవంగాలు ఒక ప్రత్యేకమైన సువాసనను కలిగి ఉంటాయి. ఇవి కూడా పురుగులను దూరంగా ఉంచుతాయి. వెల్లుల్లి నుంచి వచ్చే శక్తివంతమైన వాసన కారణంగా.. వెల్లుల్లి సహజ క్రిమి నిరోధకంగా కూడా పనిచేస్తుంది. మీ బియ్యం కంటైనర్‌లో కొన్ని పొట్టు తీసిన వెల్లుల్లి రెబ్బలను ఉంచడం వల్ల పురుగులను దూరంగా ఉంచొచ్చు. వేప ఆకులను తరచుగా సహజ క్రిమి సంహారకంగా ఉపయోగిస్తారు. ఈ ఆకులు కీటకాలను తిప్పికొట్టే చేదు వాసనను విడుదల చేస్తాయి. మీ బియ్యం నిల్వలో కొన్ని ఎండిన వేప ఆకులను జోడించడం వలన పురుగుల నుంచి బియ్యాన్ని రక్షించుకోవచ్చు. అది కూడా సహజసిద్ధమైన మార్గంలో ఎలాంటి కెమికల్స్ లేకుండా పురుగులను అరికట్టవచ్చు. వేప ఆకులను బియ్యంలో వేయడం వల్ల బియ్యం రుచి ఏ మాత్రం మారదు. అలాగే ఇంలాంటి అపాయము జరగదు. ఈ టిప్స్ పాటించడం ద్వారా బియ్యం పురుగు పట్టకుండా జాగ్రత్త వహించవచ్చు.





## మ్యాగీ ఇలా ట్రై చేసి చూడండి..

# పిల్లలు అస్సలు వదిలిపెట్టరు

ఇంట్లో ఏ టిఫిన్ అందుబాటులో లేకపోతే తల్లులకు ఠక్కున గుర్తొచ్చే బ్రేక్ ఫాస్ట్ ఐటమ్ మ్యాగీ. అయితే ఈ మ్యాగీని కూడా కొంచెం వెరైటీగా చేస్తే పిల్లలు ఇష్టంగా లాగించేస్తారు. అలా అని నిత్యం మ్యాగీ కూడా చేయొద్దు. ఎందుకంటే ఇదంత హెల్దీ బ్రేక్ ఫాస్ట్ కాదు. అయితే మ్యాగీని కొంచెం వెరైటీగా ఎలా చేయాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. చిల్లీ గార్లిక్ మ్యాగీని పిల్లలకు చేసి పెట్టండి మరి.

### చిల్లిగార్లిక్ మ్యాగీ తయారీకి కావాల్సిన పదార్థాలు

- పొట్టు తీసిన రెండు వెల్లుల్లి రెబ్బలు
- ఒక టీ స్పూన్ తరిగిన ఎండు మిరపకాయలు
- అర టీ స్పూన్ కారంపొడి
- అర టీ స్పూన్ మ్యాగీ మసాలా సాచెట్
- సన్నగా తరిగిన రెండు పచ్చిమిర్చి
- సన్నగా తరిగిన ఒక ఉల్లిపాయ
- ఒక టీ స్పూన్ సోయా సార్
- ఒక టీ స్పూన్ వైట్ వెనిగర్
- కొంచెం వంట నూనె

### చిల్లీ-గార్లిక్ మ్యాగీ తయారు చేసుకునే విధానం

మీడియం సైజు పాన్ లో కొంత నీరు పోసి.. అందులోనే ఒక టీ స్పూన్ వంటనూనె వేయాలి. కొంత నీరు మరిగాక.. అందులో ఒక ప్యాకెట్ మ్యాగీని వేసి మరిగించాలి. మరీ మెత్తబడకుండా, కొంచెం గట్టిగానే ఉండేలా మరిగించుకోవాలి. తరువాత ఒక పెద్ద జల్లెడ తీసుకొని.. మ్యాగీని నీటిని వేరు చేయాలి.

ఇప్పుడు ఒక మిక్సీలో పైన పేర్కొనబడిన పదార్థాలన్నిటినీ బాగా మిక్సీ పట్టుకోవాలి. అన్ని బాగా మెత్తగా గ్రైండ్ అయినట్లు నిర్ధారించుకున్న తరువాతే వాటిని మిక్సీ గిన్నెలో నుంచి బయటికి తీసేయాలి. ఇప్పుడు ఒక చిన్న గిన్నె తీసుకొని, అందులో కొంచెం నూనెను పోసుకోవాలి. అందులోనే కొన్ని వెల్లుల్లి రెబ్బలు వేసుకోవాలి. నూనె, వెల్లుల్లి వేడెక్కిన తరువాత అందులో మనం మిక్సీ పట్టుకొని ఉంచిన మిశ్రమాన్ని వేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని, వెల్లుల్లి నూనెతో బాగా కలుపుకోవాలి. మిశ్రమం మొత్తం వెల్లుల్లికి, నూనెలో కలిసే విధంగా బాగా కలుపుకోవాలి. నూనె, మసాలా బాగా కలిసిపోయిన తరువాత అందులో మనం ముందుగానే వడగట్టిన మ్యాగీని వేసుకోవాలి. ఆ మ్యాగీకి మసాలా మొత్తం పెట్టుకునేలా బాగా కలుపుకోవాలి. అప్పుడే మ్యాగీకి సరైన ఫ్లేవర్ వస్తుంది. అదనపు క్రంచ్ కోసం మ్యాగీపై తెల్ల నువ్వులు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ఆకులను వేసుకోవాలి. అనంతరం కాసేపు మీడియం మంట మీద ఉంచి, మ్యాగీని మంట నుంచి కిందకు తీసేస్తే సరి. వేడి వేడిగా, ఎంతో రుచికరమైన చిల్లిగార్లిక్ మ్యాగీ రెడీ అయిపోతుంది.









## మతిమరుపును తగ్గించుకొనే

# చిట్కాలివే..!

**తీవ్రమైన పని ఒత్తిడి, జీవనశైలిలో వస్తున్న మార్పులు, సమయానికి తిండి, నిద్ర లేకపోవడం వంటి కారణాలతో చాలా మందికి మతిమరుపు వచ్చేస్తోంది. అయితే ఈ మతిమరుపు సమస్య నుంచి ఎలా బయటపడాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. జ్ఞాపకశక్తిని ఎలా పెంచుకోవాలి? తదితర విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం..**

**తగినంత నిద్ర పొందండి:**

నిద్రలేమి జ్ఞాపకశక్తిని బలహీనపరుస్తుంది. అందుకే రోజు 78 గంటల నిద్ర పోవడం అలవాటు చేసుకోండి. గింజలు, పండ్లు, కూరగాయలతో పాటు ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారం జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది.విటమిన్లు ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తినండి.

**క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి:**

వ్యాయామం మెదడులో రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. అంతే కాకుండా జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. అందుకు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోండి.

**ఒత్తిడిని తగ్గించుకోండి:**

యోగా, ధ్యానం లేదా ఇతర ఒత్తిడిని తగ్గించే పనులను ప్రాక్టీస్ చేయండి.

**తగినంత నీరు త్రాగండి:**

శరీరంలో నీరు లేకపోవడం జ్ఞాపకశక్తిని కూడా ప్రభావితం చేస్తుంది. అందుకే ప్రతి రోజు 8 10 గ్లాసుల నీరు తాగండి.

**జ్ఞాపకశక్తిని మెరుగుపరిచే మార్గాలు..**

కొత్త విషయాలను నేర్చుకోండి: కొత్త భాషను నేర్చుకోండి. కొత్త సంగీత వాయిద్యాన్ని ప్లే చేయండి .లేదా కొత్త కళను నేర్చుకోండి. ఇది మెదడును చురుకుగా ఉంచుతుంది. పుస్తకాలు చదవడం వల్ల మెదడుకు పదును పెట్టి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చెస్, సుడోకు లేదా ఇతర మెదడును ఉత్తేజపరిచే ఆటలు ఆడండి. మీ ఆలోచనలు, అనుభవాలను వ్రాయండి. ఇది జ్ఞాపకశక్తిని





# గలీజ్ మాటలు అన్నారు..



'బేబీ' చిత్రంతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించి ఓవర్ నైట్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ వైష్ణవి చైతన్య ఇటీవల 'ఎపిక్' మూవీతో మరోసారి థియేటర్ల ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను, ముఖ్యంగా 'బేబీ' సినిమా సమయంలో వచ్చిన విపరీతమైన నెగెటివిటీని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. తనకు 'బేబీ' సినిమాతో ఒక్క రాత్రిలో ఎలాంటి సక్సెస్ రాలేదని వైష్ణవి స్పష్టం చేశారు. కవర్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్, పలు చిత్రాల్లో చిన్న చిన్న క్యారెక్టర్ రోల్స్ చేస్తూ ఎంతో కష్టపడి ఇక్కడికి చేరుకున్నానని ఆమె తెలిపారు.

అయితే సినిమా విడుదలైన తర్వాత కొందరు తనను ఉద్దేశించి నోటికి వచ్చినట్లు గలీజ్‌గా మాట్లాడారని, థియేటర్ల వద్ద తన పోస్టర్లపై చెప్పులతో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఆ దృశ్యాలన్నీ చూశాక ఎంతో బాధపడ్డానని తెలిపారు. సినిమా సూపర్ హిట్ అయిందని సంతోషించాలా? లేక తాను పడిన కష్టానికి ఈ రకమైన అవమానాలే బహుమతిగా వస్తున్నాయని బాధపడాలా? అనే తీవ్రమైన మానసిక వేదనలోకి వెళ్లిపోయానని వైష్ణవి అన్నారు. అయితే కాలం మారుతున్న కొద్దీ ఆ నెగెటివిటీ గురించి పట్టించుకోవడం మానేశానని, కేవలం తన పనిపై, సానుకూల అంశాలపై మాత్రమే దృష్టి పెట్టడం మొదలుపెట్టానని ఆమె వివరించారు.

## నేనూ బాడీ షేమింగ్ ఎదుర్కొన్నా.. బరువు ఎలా తగ్గానంటే?

ప్రముఖ వ్యాపారవేత్త, రామ్ చరణ్ సతీమణి ఉపాసన (Upasana) తన ఫిట్‌నెస్ ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. 18ఏళ్ల వయసులోనే ఆమె 95 కిలోల బరువు ఉండేవారట. చరణ్‌తో పెళ్లి సమయంలోనూ తను ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నానని ఆమె ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. "అమెరికాలో చదువుకునే రోజుల్లో కుటుంబానికి దూరంగా ఉండటం వల్ల బెంగగా ఉండేది. ఆ ఒత్తిడి నుంచి బయట పడేందుకు ఎక్కువగా తినేదాన్ని. దానివల్లే 18 ఏళ్ల వయసులో 95 కిలోల బరువు పెరిగా. ఆ తర్వాత బరువు తగ్గేందుకు చాలామంది డైటీషియన్లను కలిశా. రకరకాల డైట్లు ప్రయత్నించా. చివరికి అన్నం, గోధుమలకు బదులుగా ఓట్స్, హై ప్రొటీన్ ఆహారం తీసుకోవడం వల్ల మంచి ఫలితం కనిపించింది. కాలేజీకి నడుచుకుంటూనే వెళ్లేదాన్ని. అలా రోజూ 10 వేల అడుగులు నడవడం అలవాటు చేసుకున్నా"

"చరణ్ (Ramcharan)తో వివాహం జరిగిన సమయంలోనూ నా బరువుపై బాగా కామెంట్లు వచ్చాయి. 'చరణ్‌కు ఆమె తగిన జోడీ కాదు.. చాలా లావుగా ఉంది' అంటూ కొందరు కామెంట్లు చేశారు. మొదట్లో ఆ మాటలకు చాలా బాధపడేదాన్ని. కానీ, ఆ తర్వాత వాటి వల్లే మానసికంగా దృఢంగా మారాను. నా వాళ్లు ఏమనుకుంటున్నారు అనేది మాత్రమే నాకు ముఖ్యం. విమర్శలను పట్టించుకోకుండా వాటిని ఎలా ఎదుర్కోవాలో ఇప్పుడు బాగా తెలిసింది" అని ఉపాసన పేర్కొన్నారు.



## అట్లీతో సినిమా సన్నాహాల్లో షారుక్?

'కింగ్' సినిమాతో సెట్స్‌పై బిజీగా ఉన్నారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు షారుక్ ఖాన్. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకొణె కథానాయిక. డిసెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తర్వాత షారుక్ తదుపరి చిత్రాల గురించి ఇప్పటి వరకూ ఎలాంటి కొత్త కబురు వినిపించనే లేదు. ఈ నేపథ్యంలోనే ఆయన.. దర్శకుడు అట్లీ కాంబోలో వచ్చిన 'జవాన్' చిత్రానికి సీక్వెల్ వస్తుందని గతంలో వార్తలొచ్చాయి. అయితే తాజాగా వీరిద్దరూ మరో కొత్త ప్రాజెక్ట్ కోసం చేతులు కలపనున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరి కలయికలో వచ్చిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ జోరునే కొనసాగిస్తూ వీళ్ల కాంబోలో మరో చిత్రాన్ని రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు బాలీవుడ్ సన్నిహిత వర్గాల సమాచారం.



## అయినా కల నెరవేరలేదనిపిస్తుంది

బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు ఎన్నో భాషల్లో విభిన్న పాత్రలు పోషించి మెప్పించారు ప్రముఖ నటుడు మురళీ శర్మ (Murali Sharma). ఇటీవల ఆయన 'సూపర్ సుబ్బు' వెబ్ సిరీస్‌తో డిజిటల్ రంగంలోకి (ఓటీటీ) అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "గతంతో పోలిస్తే ఇప్పుడు సినిమాల్లో చాలా మార్పులొచ్చాయి. ముఖ్యంగా కథ రాసే విధానంలో నాణ్యత బాగా పెరిగింది. ఒక సినిమాకు కథే ప్రాణం. నేను ఇప్పటి వరకు 250కి పైగా చిత్రాల్లో నటించానంటే నాకే నమ్మశక్యంగా లేదు. అయినా నా కల నెరవేరలేదనిపిస్తుంది. ఎందుకంటే, కెరీర్ ప్రారంభంలో ఇంత స్థాయిలో ఎదుగుతానని అనుకోలేదు. అంత పెద్ద కల కనే ధైర్యం కూడా చేయలేదు" అని ఆయన సరదాగా చెప్పుకొచ్చారు. సినిమాల్లో పాత్ర నిడివి గురించి తానెప్పుడూ ఆలోచించనని మురళీ శర్మ స్పష్టం చేశారు. "ఇచ్చిన పాత్రకు ఎంత వరకు న్యాయం చేశాననేదే నాకు ముఖ్యం. సినిమాలో నా పాత్ర నిడివి ఎంత ఉందనేది ఎప్పుడూ చూడలేదు. అదృష్టవశాత్తూ నా సినీ ప్రయాణంలో ఎన్నో వైవిధ్యభరిత పాత్రలు దక్కాయి. తెలుగులో నన్ను తండ్రి పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా భావిస్తుంటారు. అయితే, నేను ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలు చేస్తున్నానని ఫీల్ కాలేదు. దర్శకుడు నాకు ఏ పాత్ర ఇచ్చినా దానికి వంద శాతం న్యాయం చేయడమే నా బాధ్యతగా భావిస్తాను" అని ఆయన వివరించారు.





## డిమాండ్ చేస్తే యాక్షన్‌కీ వెనకాడను!

"అడుక్కునే వాళ్లకి కూడా ఆదివారం ఉంటుంది కానీ ఈ అప్పల వాళ్లకి ఉండదు" అంటున్నారు చిట్టిబాబు. మరి ఆయనెవరు.. తన కుటుంబ కథేంటి? తెలియాలంటే 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' చూడాల్సిందే. వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. నారా రోహిత్, నివేదా పేతురాజ్, సత్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు.

"డబ్బుకీ.. సబ్బుకీ ఓ పోలికుంది. మొదటిది చూస్తుండగానే కరిగిపోద్ది. రెండోది ఆలోచించేలోపే అరిగిపోద్ది" అంటూ చిట్టిబాబుగా వెంకీ చెప్పే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం అలరించేలా సాగింది. సగటు మధ్యతరగతి ఉద్యోగిగా చిట్టిబాబు జీవితాన్ని.. భార్య చేసే అప్పుల వల్ల తను పడే తిప్పల్ని ఈ ప్రచార చిత్రంలో ఫన్నీగా చూపించారు. వాళ్లంతా అకస్మాత్తుగా ఒక్కరాత్రిలో ధనవంతులుగా మారడం.. దానివల్ల ఆ కుటుంబానికి ఎదురైన చిక్కులు.. అందులో నుంచి బయట పడేందుకు భార్యాబిడ్డలతో కలిసి చిట్టిబాబు చేసిన సాహసాలు టీజర్‌లో ఆసక్తిరేకెత్తించాయి.

"నాకు ఫ్యామిలీ ఇమేజ్ ఉందని నాకు తెలుసు. కానీ, సిట్యువేషన్ డిమాండ్ చేస్తే యాక్షన్ చేయడానికి వెనకాడను" అంటూ వెంకీ చేసిన యాక్షన్ హంగామా ఆకట్టుకుంది. "నది గట్టు దాటితే వరదంటారు. అదే సముద్రం దాటితే ఉప్పెనంటారు. కానీ, సామాన్యుడు దాటితే.! బలమైన పదం.. స్ట్రాంగ్ సౌండ్ వచ్చేది మీరే వెతకండి సర్" అంటూ ఆఖర్లో ఓ పోలీసుతో వెంకటేశ్ చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి సంగీతం: తమన్, కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: రవి కె చంద్రన్.

## కాకా.. ధూమ్ ధమాకా!

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డేమారి, నరేశ్ ప్రధాన పాత్రధారులుగా బద్రప్ప గాజుల తెరకెక్కించిన చిత్రం 'క్రేజీ కళ్యాణం'. బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మించారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్రం నుంచి పెళ్లి బరాత్ గీతాన్ని విడుదల చేశారు.

"కాకా ధూమ్ ధమాకా.. లగ్గం ఇంట్ల పందిర్లే పడ్డాక" అంటూ హుషారుగా సాగిన ఈ పాటకు సురేశ్ బొబ్బిలి స్వరాలు సమకూర్చడమే గాక స్వయంగా ఆలపించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యమందించారు. ఈశ్వర్ పెంటి నృత్యరీతులు అందించారు. ఈ పాటలో అనుపమ వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి కూర్పు: శ్రావణ్ కటికనేని, ఛాయాగ్రహణం: శ్యామ్ దూపాటి.



## టొరంటో అంతర్జాతీయ చిత్రోత్సవంలో... డోరతి



కథానాయిక కీర్తి సురేశ్, సనంత్, రిషికాంత్ ప్రధాన పాత్రాధారులుగా రూపొందిన తమిళ సినిమా 'డోరతి'. కార్తిక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని గునీత్ మోంగా కపూర్, అచిన్ జైన్, జ్యోతిదేశ్‌పాండే సంయుక్తంగా నిర్మించారు. తాజాగా ఈ సినిమా టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం(టిఫ్)2026లో ప్రదర్శితమైనట్లు సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది చిత్రబృందం. ప్రీమియర్ అనంతరం ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి స్టాండింగ్ ఒవేషన్ లభించింది. దీంతో సినీ బృందం ఇన్‌స్టాలో 'ఈ క్షణాన్ని పంచుకోవడం మరపురానిది. ఈ చిత్రానికి జీవం పోసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అనే క్యాప్షన్‌తో ఫొటోలని పంచుకుంది. దశాబ్ద కాలంలో టిఫ్‌లో ప్రదర్శితమైన తొలి తమిళ చిత్రంగా నిలిచింది 'డోరతి'. 90ల కాలంలో చిన్ననాటి ఇద్దరు స్నేహితులు, వారికి పరిచయమైన డోరతి అనే మహిళ చుట్టూ తిరిగే కథ ఇదని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమా ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.